RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 232 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | బుధవారం, మార్చి,11, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 232 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Wednesday, March,11, 2026 | PAGES : 8 RS : 4 /- |



## హైదరాబాద్ చేరుకున్న

# కొత్త గవర్నర్

## శివప్రతాప్ శుక్లాను స్వాగతించిన సిఎం

**హైదరాబాద్,మార్చి10,తెలంగాణ దిశ :** తెలంగాణకు కొత్తగా నియమితులైన నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. ఎయిర్పోర్టుకు చేరుకున్న సిఎం రేవంత్ తదితరులున గవర్నర్‌కు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు గవర్నర్‌కు స్వాగతం పలికి వారిలో ఉన్నారు. అనంతరం గవర్నర్ నేరుగా లోక్‌భవన్ చేరుకున్నారు.




## న్యాయవ్యవస్థ అవినీతి పాఠ్యాంశం

# తొలగించాం

- పుస్తకాన్ని అందుబాటులో లేకుండా చేశాం
- సుప్రీం కోర్టుకు ఎన్‌సిఇఆర్‌టి బహిరంగ క్షమాపణలు

న్యూఢిల్లీ,మార్చి10 : 8వ తరగతి సోషల్ పాఠ్యపుస్తకంలో వివాదాస్ప ద అధ్యాయంపై 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఎన్‌సిఇఆర్‌టి మంగళవా రం సుప్రీంకోర్టుకి బహిరంగ క్షమాపణలు తెలిపింది. న్యాయవ్యవస్థలో 'అవినీతి'గురించి పాఠ్యపుస్తకంలో ప్రస్తావించడంపై సుప్రీం కోర్టు రెండు వారాల క్రితం ఎన్‌సి ఇఆర్‌టిని మందలించిన సంగతి తెలిసిందే. ఈ అధ్యాయంపై సు మోటోగా కేసు నమోదు చేసిన సుప్రీంకోర్టు.. పాఠ్యపుస్తకాన్ని ఉప సంహరించుకోవాలని ఆదేశించింది.



## పుతిన్‌తో ట్రంప్

# సుదీర్ఘ ఫోన్ కాల్

**- అమెరికా, రష్యా అధ్యక్షుల మధ్య గంటపాటు ఫోన్ సంభాషణ..!**

ఢిల్లీ,: అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఫోన్‌లో దాదాపు గంటపాటు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఇరాన్ యుద్ధం, అలాగే ఉక్రెయిన్ సంక్షోభం తీవ్రతపై ఇరువురు నేతలు విస్తృతంగా మాట్లాడుకున్నారు. ట్రంప్ చొరవతోనే ఈ ఫోన్ కాల్ సంభాషణ జరిగిందని రష్యా అధ్యక్ష భవనం ప్రతినిధి యూరి వుషకోవ్ మీడియాకు తెలిపారు. ఈ సంభాషణ ఎంతో నిర్మాణాత్మకంగా సాగిందని, ఇది ఇరు దేశాల నేతల మధ్య జరిగే సాధారణ చర్చల వంటిదేనని ఆయన వివరించారు. మరోవైపు, ట్రంప్ మాట్లాడుతూ, "నేను పుతిన్‌తో చాలా మంచి సంభాషణ జరిపాను. ఉక్రెయిన్ గురించి చర్చించాం. అదొక ఎప్పటికీ అంతం కాని యుద్ధం. కానీ, ఈ అంశంపై సానుకూల చర్చ జరిగింది..



## ఇంధన ధరలు

# దిగి వస్తాయి

### త్వరలోనే ఇరాన్ యుద్ధం ముగుస్తుంది ట్రంప్ సంచలన ప్రకటన

వాషింగ్టన్,మార్చి10 : ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతుం దని, వెనక్కి తగ్గేది లేదన్న ట్రంప్ కొంత మెత్తబడ్డారు. వెనక్కి తగ్గుతున్నట్లుగా కనిపిస్తున్నారు. ఇరాన్ కూడా గట్టి హెచ్చరికలు చేయడంతోనో ఏమో యుద్ధానికి త్వర లోనే ముగింపు దొరుకుతుందని అన్నారు. ఇరాన్ యుద్ధం త్వరలోనే ముగుస్తుందని, చమురు ధరలు కిందకు దిగి వస్తాయనిఅమెరికా అధ్యక్షుడుడొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.



## మూడేళ్లలో పంచాయితీలకు

# శాశ్వత భవనాలు

- హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి నిధుల మంజూరు
- వివిధ శాఖల అధికారులతో డిప్యూటి సిఎం భట్టి సమీక్ష

**హైదరాబాద్, మార్చి10,తెలంగాణ దిశ :** రాబోయే మూడేళ్లలో శాశ్వత భవనాలు లేని అన్ని గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. బడ్జెట్‌ను పురస్కరించుకుని మంగళవారం వివిధ శాఖల అధికారులు, మంత్రులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారులతో సమావేశమై, హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి నిధుల మంజూరుపై సమీక్షించారు. 'తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కల్పించే కోర్సులు ప్రవేశపెట్టాలి. గ్లోబల్ సమ్మిట్‌లో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలతో ఏటీసీ కోర్సులు ప్రారంభిస్తాము. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారానే జరగాలని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఐటీడీఏల సహకారంతో గిరిజనులను పారిశ్రామికవేత్తలు గా తీర్చిదిద్దాలి. తెలంగాణ పర్యాటక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలి. కవ్వాల్, శ్రీశైలం టైగర్ జోన్ల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. ప్రభుత్వం ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై చర్యలు తీసుకుంటుంది.




డ్రగ్స్ మహమ్మారి నివారణకు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. డ్రగ్స్ దుష్ప్రభా వాలపై కళారూపాల ద్వారా యువతకు అవ గాహన కల్పించాలి' అని డిప్యూటీ సీ ఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇది లావుంటే రాష్ట్రంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.



## బెంగాల్లో ప్రశాంతంగా ఎన్నికల

# నిర్వహణ

కోల్‌కతా,మార్చి10 : ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఏ ఒక్క ఓటరును తొలగించేది లేదని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, సజావుగా, ప్రశాంతంగా ఎన్నికలు జరపడానికే ఎన్నికల సంఘం మొదటి ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఎన్నికల పక్రియలో ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈసీ ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉంటుందని, ఎలాంటి లోటుపాట్లను సహించేది లేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీలు, అధికారులతో వరుస సమావేశాల అనంతరం మీడియాతో సీఈసీ మంగళవారంనాడు మాట్లాడారు.పశ్చిమబెంగాల్‌లో 80,000 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వీటిలో61,000 బూత్‌లు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయని సీఈసీ చెప్పారు. ఓటింగ్ పక్రియలో పారదర్శకత, అవకతవకల నిరోధానికి అన్ని పోలింగ్ బూత్‌లలో వెబ్‌కాస్టింగ్ పక్రియ అమలు చేస్తామని తెలిపారు.




## గ్రేటర్ లో పట్టు

# సాధ్యమేనా..?

**హైదరాబాద్, మార్చి 10,తెలంగాణ దిశ :** తెలంగాణ రాజకీయాలకు గుండెకాయ వంటి హైదరాబాద్‌లో ఇప్పుడు ముందస్తు రాజకీయ వేడి రాజుకుంది. మొన్నటి వరకు ఒకే గొడుగు కింద ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పుడు మూడు ముక్కలు (హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్) కావడంతో, పాత సమీకరణాలు చెదిరి కొత్త పొత్తులు, ఎత్తుగడలకు తెరలేచింది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్, దూకుడు మీదున్న బీజేపీల మధ్య నలిగిపోతున్న భారత్ రాష్ట్ర సమితి నేతలు ఇప్పుడు తమ రాజకీయ భవిష్యత్తు కోసం పక్కచూపులు చూస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ని మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా విభజించాలని నిర్ణయించడం ఈ మొత్తం గందరగోళానికి ప్రధాన కారణం. 150 డివిజన్లతో హైదరాబాద్, 74 డివిజన్లతో మాల్కాజిగిరి, 76 డివిజన్లతో సైబరాబాద్ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం డివిజన్ల సంఖ్య 150 నుంచి 300కి పెరగడం, సరిహద్దుల పునర్విభజన జరగడంతో చాలామంది సిట్టింగ్ కార్పొరేటర్లకు తమ పట్టున్న ప్రాంతాలు చేజారుతాయనే భయం పట్టుకుంది. ఈ రీ-ఆర్గనైజేషన్ వల్ల గ్రామీణ ప్రాంతాలు పట్టణ కార్పొరేషన్లలో కలవడంతో ఓటు బ్యాంకు సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. 2016 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 99 సీట్లు, 2020లో 56 సీట్లకు పరిమితమైంది.



## రంగనాయక్ సాగర్‌పై ఎందుకీ

# తాత్సారం

- ఆందోళన చేస్తున్న రైతుల అరెస్ట్ దుర్మార్గం
- మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్,మార్చి10 ,తెలంగాణ దిశ :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో రంగనాయక్ సాగర్ కెనాల్ పనులు పూర్తి చేయాలంటూ నిరసనకు దిగిన రైతులను అరెస్ట్ చేయడాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ ఖండించారు. సమస్యలపై ఆందోళన చేస్తే అరెస్ట్ చేస్తారా అని ప్రశ్నించారు. ఇదేనా ప్రజాప్రభుత్వం తీరు అంటూ విమర్శలు గుప్పించారు. మంగళవారం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతులు నిరసన చేస్తే వారిని అరెస్ట్ చేస్తారా అంటూ మండిపడ్డారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగ ళ్లపల్లి మండలానికి నీళ్లిచ్చే కాలువ పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని కేంద్రమంత్రి ప్రశ్నించారు. రూ.3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా పనులు ఎందుకు ప్రారంభించలేదని అడిగారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి, జమదగ్ని మహామునిస్వామి కళ్యాణ మహోత్సవం







**కుషాయిగూడ, మార్చి 10, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ శుభోదయ కాలనీలో ఉన్న శ్రీశ్రీశ్రీ సురమాంభదేవి సమేత కంతమహేశ్వర స్వామి, శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి, శ్రీశ్రీశ్రీ వనదుర్గాదేవి దేవాలయంలో రేణుక ఎల్లమ్మ దేవి, జమదగ్ని మహాముని స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మార్చి 9 నుండి 10 తేదీలలో రెండు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో ఈ మహోత్సవాలను నిర్వహించారు. భక్తుల లోకక్షేమం కోసం నిర్వహిస్తున్న ఈ కళ్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున త్వరలో వచ్చే ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు సోమవారం లందకు వెళ్ళుట, పుట్ట బంగారం కమ్ముట, పుట్ట బంగారం తెచ్చుట కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి భక్తి భావంతో జోలపాట కార్యక్రమం జరిగింది. రెండవ రోజు మంగళవారం కోట్నం పెట్టుట, వృషభ లగ్నంలో రేణుక ఎల్లమ్మ దేవి, జమదగ్ని మహాముని స్వామి వారి దివ్య కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం సదర్ ఘటము, అన్న ప్రసాద వితరణ, తీర్థ ప్రసాదం పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త మహాశయులు, గౌడ కులస్థులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమాలను శ్రీశ్రీశ్రీ సురమాంభదేవి సమేత కంతమహేశ్వర స్వామి, శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి, శ్రీశ్రీశ్రీ వనదుర్గాదేవి దేవాలయ కమిటీ, కుషాయిగూడ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో ముఖ్య అతిథులుగా బీసీ కమీషన్ సభ్యురాలు బాలలక్ష్మి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం, ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, గౌడ హాస్టల్ ప్రెసిడెంట్ మోతె చక్రవర్తి గౌడ్, అదిలాబాద్ డిప్యూటీ ట్రాన్స్ ఫోర్ట్ కమిషనర్ పుల్లెంల రవీందర్ గౌడ్, గోపా రాష్ట్ర అధ్యక్షులు బండి సాయన్న గౌడ్, కుషాయిగూడ డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్, సలహాదారులు బెలిదే అశోక్ గుప్తా, ఉపాధ్యక్షులు యావాపురం రవి, కోశాధికారి రామచంద్ర మూర్తి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి కళ్యాణ మహోత్సవ వేడుకలను దర్శించుకుని, అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దేవతల దివ్య కటాక్షంతో ప్రతి కుటుంబంలో ఐశ్వర్యం, సంతోషం, శాంతి నిండాలని వారు ఆకాంక్షించారు.



# నెక్లెస్ రోడ్‌లోని నీరా కేఫే భవనం లీజుకు టెండర్లు




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 10, (తెలంగాణ దిశ)** : హైదరాబాద్ నగరంలోని నెక్లెస్ రోడ్ వద్ద ఉన్న నీరా కేఫే భవనాన్ని లీజుకు ఇవ్వడానికి తెలంగాణ తాడి తాపర్లు సహకార ఆర్థిక సంస్థ (టిటిటిసిఎఫ్ సి) టెండర్లు ఆహ్వానించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి తెలిపారు. ఈ భవనంలో నీరా ప్రాసెసింగ్ యూనిట్, బ్యాంక్వెట్ హాల్‌తో పాటు ఏడు వాణిజ్య దుకాణాలు ఉన్నాయి. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో గౌడ వృత్తికి చెందిన సంఘాలు, 01-01-2026 నాటికి ఎక్సైజ్ శాఖలో నమోదు అయి క్రియాశీలంగా ఉన్న సంఘాల నుండి నిర్దిష్ట నిబంధనలు, షరతుల మేరకు టెండర్లు పిలిచినట్లు వెల్లడించారు. ఆసక్తి గల గౌడ వృత్తి సంఘాలు మార్చి 9 ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆన్లైన్ ద్వారా బిడ్లు దాఖలు చేసుకోవచ్చని, బిడ్ల దాఖలుకు చివరి తేదీ మార్చి 18 మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుందని తెలిపారు.సాంకేతిక బిడ్‌ను మార్చి 20 ఉదయం 10.30 గంటలకు తెరవనున్నట్లు, అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు ఆర్థిక బిడ్‌ను తెరవనున్నట్లు పేర్కొన్నారు. టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, దరఖాస్తు విధానం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి తెలిపారు.

# ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ.50 లక్షల మోసం

## - నిందితుల్లో ఒకరి అరెస్ట్ - 137 మంది బాధితులు




**కుత్బుల్లాపూర్, మార్చి 10, (తెలంగాణ దిశ)** :ఆకర్షణీయమైన ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను మోసం చేసిన ముగ్గురు వ్యక్తుల ముఠా సుమారు రూ.50 లక్షల మేర డబ్బు వసూలు చేసి బురిడీ కొట్టించిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు మంగళవారం నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.బాచుపల్లి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, కేసు దర్యాప్తు అధికారి ఎన్. సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... జక్కుల అజయ్, కొండాజీ శ్రావణి, సాదుల సద్గుణ అనే ముగ్గురు వ్యక్తులు కలిసి ఒక ముఠాగా ఏర్పడి మల్టీనేషనల్ కంపెనీల్లో మంచి వేతనాలతో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మబలికారు. వారి మాటలను నమ్మిన నిజాంపేట్‌కు చెందిన కాసుల జగదీష్ ఫిబ్రవరి 14న బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో మొత్తం 137 మంది నిరుద్యోగులు మోసపోయినట్లు తేలింది. నిందితులు ఉద్యోగాల పేరుతో ఒక్కొక్కరి నుండి రూ.20 వేల నుండి రూ.90 వేల వరకు ప్లేస్‌మెంట్ చార్జీల పేరుతో వసూలు చేశారు. ఫిర్యాదుదారుడు జగదీష్ తన ఖాతా మరియు తన సహచరుల ఖాతాల ద్వారా మొత్తం రూ.47 లక్షల 20 వేల రూపాయలను నిందితుల ఖాతాల్లోకి బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. బాధితులకు "హక్సిన్స్" అనే కంపెనీ పేరుతో నకిలీ ఆఫర్ లెటర్లు కూడా అందించారు. అయితే ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు తమ డబ్బును తిరిగి ఇవ్వాలని కోరగా నిందితులు స్పందించడం మానేశారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బ్యాంకు ఖాతాల లావాదేవీలు, ఇతర ఆధారాలను పరిశీలించిన పోలీసులు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ నెల 9న జగిత్యాల జిల్లా కోరుట్లకు వెళ్లిన పోలీసు బృందం ప్రధాన నిందితుడు జక్కుల అజయ్‌ను అదుపులోకి తీసుకుంది. విచారణలో అతడు తన నేరాన్ని అంగీకరించడంతో పాటు కొండాజీ శ్రావణితో కలిసి ఈ మోసానికి కుట్ర పన్నినట్లు వెల్లడించాడు. శ్రావణి గతంలో ఒక సంస్థలో హెచ్ఆర్ విభాగంలో పనిచేసిన అనుభవాన్ని ఉపయోగించి తాను హెచ్ఆర్ అధికారినని చెప్పి నిరుద్యోగులను నమ్మబలికిందని పోలీసులు తెలిపారు. డబ్బులు వసూలు చేసే ఆలోచన కూడా ఆమె నుంచే వచ్చినట్లు అజయ్ తెలిపినట్లు సమాచారం. ప్రధాన నిందితుడు జక్కుల అజయ్‌ను పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. మిగతా నిందితులు కొండాజీ శ్రావణి, సాదుల సద్గుణ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఉప్పల్ భగాయత్ అభివృద్ధికి రూ.13 కోట్ల నిధులు మంజూరు

## - ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, మార్చి 10, (తెలంగాణ దిశ)** : ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ భగాయత్ ప్రాంత అభివృద్ధికి రూ.13 కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పలుమార్లు సమర్పించిన వినతి పత్రాలను పరిశీలించిన హెచ్‌ఎండిఏ అధికారులు ఈ నిధులను వివిధ అభివృద్ధి పనుల కోసం కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నిధుల్లో భాగంగా రూ.3.40 కోట్ల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే రూ.9.60 కోట్లతో సుమారు 10 కిలోమీటర్ల మేర బ్లాక్‌టాప్ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టి కాలనీలో రహదారి సౌకర్యాలను మెరుగుపరచనున్నారు. ఇక హెచ్‌ఎండిఏ లేఔట్ పరిధిలో రోడ్లపై చెత్త పేరుకుపోయి నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, అసోసియేషన్ సభ్యుల విజ్ఞప్తి మేరకు 42 మంది పారిశుద్ధ్య కార్మికులను ప్రత్యేకంగా కేటాయించినట్లు అధికారులు తెలిపారు. దీంతో కాలనీలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడనున్నాయని పేర్కొన్నారు.అదే విధంగా లే అవుట్ లో రైతు బజార్ కోసం కేటాయించిన స్థలంలో కూరగాయల వ్యాపారం సక్రమంగా జరిగేలా అభివృద్ధి పనులు చేపట్టాలని, అలాగే సుమారు 8 ఎకరాల పార్కు స్థలానికి కాంపౌండ్ వాల్ నిర్మాణం, వాకింగ్ ట్రాక్, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. వెస్ట్ సైడ్ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, మంచినీటి సరఫరా వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చినట్లు తెలిపారు. వాటిపై సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారికి ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# కాప్రా చెరువు ప్రాంగణంలో స్వచ్ఛత

## - ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్





**కాప్రా, మార్చి 10, (తెలంగాణ దిశ)** :ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో చెరువుల పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా డివిజన్‌లో ఉన్న కాపుల చెరువు వద్ద ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్త ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ చెరువులు వంటి నీటి వనరులను సంరక్షించడం, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ఆరోగ్యకరమైన జీవన విధానానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. చెరువుల పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి ఇంజనీరింగ్ కాలేజ్‌కు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, పారిశుద్ధ్య సిబ్బంది, ఎంతమాలజీ విభాగపు సిబ్బంది కలిసి సుమారు 125 మంది పాల్గొన్నారు. చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని, పిచ్చి మొక్కలను, పొదలను తొలగించి పరిసరాలను శుభ్ర పరిచారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, డి.ఈ. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రవి, సానిటరీ సూపర్ వైజర్‌లు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు (ఈఈ, డీఈ), టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్, యూబీడీ విభాగం సిబ్బంది, లేక్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా చెరువుల పరిరక్షణతో పాటు పరిసరాల పరిశుభ్రతను కాపాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు కార్పొరేషన్ అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# వడ్డెరల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదు

## - వడ్డెర కులస్తుల భారీ ర్యాలీ

## - జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు పిట్ల శ్రీధర్




**కుత్బుల్లాపూర్, మార్చి 10, (తెలంగాణ దిశ)** :కులం పేరుతో వడ్డెరలను దూషించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వడ్డెర సంఘం నేతలు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రగతి నగర్ నుంచి బాచుపల్లి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ ప్రగతి నగర్‌కు చెందిన వడ్డెర కులస్తుడు ఉప్పు జస్వంత్‌ను రాములు నాయక్ అనే వ్యక్తి బూతులు తిడుతూ కులం పేరుతో కించపరచడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ ఘటనను నిరసిస్తూ వందలాది మంది వడ్డెర కులస్తులు, సంఘం నాయకులు ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. కుల వివక్షకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లిన అనంతరం నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఐ సతీష్‌కు ఫిర్యాదు అందజేశారు. రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా వడ్డెర కులస్తులకు ఎక్కడ అన్యాయం జరిగినా జాతీయ వడ్డెర సంఘం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కష్టించి జీవించే వడ్డెర బిడ్డల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవంతో జీవించే హక్కు ఉందని, కులం పేరుతో అవమానించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రగతి నగర్ వాసి జస్వంత్‌ను దూషించిన నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లపు శివకుమార్, పిట్ల మల్లేష్, ఏడుకొండలు, భరత్, పల్లె కృష్ణ, కుత్బుల్లాపూర్ వడ్డెర సంఘం నాయకుడు లింగస్వామి, రాష్ట్ర కార్యదర్శి జెరుపతి రాజు, బోదాస్ రవి, తన్నీరు వెంకట్రావు, షణ్ముఖ రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి జమదగ్ని స్వామివారి కళ్యాణ మహోత్సవం





**కుషాయిగూడ, మార్చి 10, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడలోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి, జమదగ్ని స్వామివారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు, కృపా కటాక్షాలతో ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పరమేశ్వర్ రెడ్డి, అలాగే బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మిలను శాలువాలతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్, టిల్లు యాదవ్, మాజీ కౌన్సిలర్ కాసుల రవీంద్ర గౌడ్, తాళ్ల వెంకటేష్ గౌడ్, కాసుల పోచయ్య గౌడ్, తాళ్ల ఆనంద్ గౌడ్, కాసుల సతీష్ గౌడ్, కూరెల్లి రాఘవేంద్ర గౌడ్, బాదంపల్లి వెంకటేష్ గౌడ్, కాసుల సురేష్ గౌడ్, పనగట్ల రామ్‌రాజ్ గౌడ్, సెంట్రింగ్ భిక్షపతి, యాదగిరి, సాకేత్, శ్రీనివాస్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, శివ, పాండు, ప్రవీణ్, చరణ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కమలా నగర్ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీపై చర్చ



**ఏఎస్ రావునగర్, మార్చి 10, (తెలంగాణ దిశ)** :ఈసీఐఎల్ చౌరస్తా సమీపంలోని టీఎస్ఐఐసీ కాలనీ, కమలానగర్‌లోని శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ నియామకానికి సంబంధించి దేవాదాయ ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానికంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేవాలయం అభివృద్ధి కమిటీ ఏర్పాటుపై, భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పన, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఆలయ అభివృద్ధి ప్రజల సహకారంతో పారదర్శకంగా జరిగేలా చూడాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపు నిచ్చారు.

# సంపాదకీయం

## 'పాశ్చాత్య నాగరికత'

'పాశ్చాత్య నాగరికతను సంరక్షించుకోడానికి యూరోపియన్ దేశాలన్నీ తమ తమ దేశాల్లోకి బైటనుంచి వచ్చే వలసలను పరిమితం చేయాలని అమెరికా పిలుపునిచ్చిందన్నదే ఆ కథనం సారాంశం. ఈ 'పాశ్చాత్య నాగరికత' అనేది చాలా విలువైనదని అనుకోవడం గాని,దానిని ఎలాగైనా కాపాడాలని అనుకోవడం గాని మూడవ ప్రపంచ దేశాలలోని చాలామందికి హాస్యాస్పదంగా అనిపిస్తుంది. పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాలు గత కొన్ని శతాబ్దాలుగా తక్కిన ప్రపంచం లోని దేశాల ప్రజలమీద సాగించిన దురాగతాలు, అత్యాచారాలు తలుచుకుంటేనే మన రోమాలు నిక్కబొడుచుకుంటాయి. సామ్రాజ్యవాద దేశాల 'నాగరికత' అటువంటి వికృతమైనది. అసలు వారి ప్రవర్తన వికృత రూపాన్ని కప్పిపుచ్చడానికి 'నాగరికత' అన్న పదంతో దానికి ముసుగు వేయడమే సహించరానిది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అనుసరించిన విధానాల వలన తలెత్తిన కరువుల ఫలితంగా భారతదేశంలో కోట్లాదిమంది ప్రాణాలను కోల్పోయారు. నిస్సహాయులైన భారత రైతాంగం నుండి ఆదాయాన్ని పిండుకోడానికి దురాశాపూరితంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వ్యవహరించిన పర్యవసానమే ఈ కరువులు. కాంగో ప్రజలమీద బెల్జియం రాజు లియోపాల్డ్ మాటలతో చెప్పడానికి అలవికాని క్రూరత్వాన్ని ప్రదర్శించాడు. నమీబియాలో జర్మన్ నిర్వహించిన నిర్బంధ శిబిరాల్లో ఏకంగా కొన్ని తెగలకు తెగలే కనుమరుగైనాయి. పాశ్చాత్య నాగరికత గురించి ఏమనుకుంటున్నారని గాంధీజీని ఒక విలేకరి అడిగితే చాలా వ్యంగ్యంగా అటువంటి 'నాగరికత' వారికి ఉండి వుంటే బాగుండేది అని ఆయన జవాబిచ్చారట. అయితే ఈ క్రూరత్వాన్ని అంతటినీ పక్కన బెట్టి కాస్సేపు పశ్చిమ దేశాలు భౌతిక సంపద విషయంలో సాధించిన పురోగతి పైనే దృష్టి సారిద్దాం. పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాలు మూడవ ప్రపంచ దేశాలను దోపిడీ చేసే విధానాలను అనుస రించడం ద్వారానే తమ పాదార్థిక అభివృద్ధిని సాధించగలిగాయి. దాని వలన ఏర్పడిన ఫలితాల ప్రభావం నుండి తప్పించుకుని ఎలాగైనా బైట పడాలని ఇప్పటికీ ఆ మూడవ ప్రపంచ దేశాల ప్రజానీకం నానా తిప్పలూ పడుతున్నారు. పశ్చిమ దేశాలు తమ స్వతంత్రమైన ప్రత్యేక శక్తి సామర్ధ్యాల ద్వారా సాధించిన అభివృద్ధి అంటూ వేరే ఏదీ లేదు. మూడవ ప్రపంచ దేశాలను సర్వనాశనం చేయడం ద్వారా మాత్రమే పాశ్చాత్య దేశాల అభివృద్ధి అనేది సాధ్యపడింది. ఇప్పుడు ఆ మూడవ ప్రపంచ దేశాల నుండే ప్రజలు వలసదారుల రూపంలో ఎక్కడికైనా పోయి తలదాచుకోడానికి నానా అగచాట్లూ పడుతున్నారు. మూడవ ప్రపంచ దేశాలు తమ తమ దేశాల్లో అభివృద్ధి మార్గాన ముందుకు సాగి తద్వారా ఈ వలసలను నియంత్రించడానికి చేస్తున్న ప్రయత్నాలను సైతం దెబ్బ తీయడానికి సామ్రాజ్యవాద దేశాలు ప్రయత్నిస్తున్నాయి. అందుకోసం అవసరమైతే సైనికపరంగా కూడా జోక్యం చేసుకోడా నికి తయారౌతున్నాయి. నేను చేస్తున్న ఈ వాదనను అతిశయోక్తులుగా పరిగణించి కొందరు కొట్టివేయవచ్చు. అటువంటివారు చేస్తున్న వాదనలు ఇలా ఉన్నాయి: 'పాశ్చాత్య దేశాల్లో గణనీయమైన సాంకేతిక మార్పులు ప్రవేశపెట్టబడ్డాయి. వాటి ద్వారా చాలా అద్భుతంగా శ్రామిక ఉత్పాదకత పెరిగింది. తద్వారా పశ్చిమ దేశాల్లో నిజవేతనాలు, నిజ ఆదాయాలు బాగా పెరిగాయి. సామ్రాజ్యవాద దేశాల్లో ఉన్నది, మూడవ ప్రపంచ దేశాల్లో కనిపించనిది ఈ కొత్త కొత్త పరిశోధనలే. ఆ సాంకేతిక పురోగతిఅన్నదే పశ్చిమ దేశాలను మూడవ ప్రపంచ దేశాల కంటే భిన్నంగా నిలబెట్టింది. వాటి ఆర్థిక గమన దిశలో పూర్తి తేడా అన్నది దానివల్లే తలెత్తింది. దాని వల్లే ఆమూడవ ప్రపంచ దేశాల నుండి వలసదారులు వేరే వేరే ప్రాంతాలకు వలసలు పోతున్నారు.'అంటే ఇక్కడ నూతన పరిశోధనల విషయంలో రెండు అంశాలను చెప్పాలి. ఏదైనా ఒక కొత్త సరుకును సంబంధించిన పరిశోధనను ఉత్పత్తి రంగంలో ఉపయోగించాలంటే అటువంటి సరుకుకు సంబంధించిన మార్కెట్ విస్తరించే పరిస్థితి ఉండాలి. అందువల్లే ఆర్థిక మాంద్యంలో చిక్కుకున్నప్పుడు కొత్త పరిశోధనలను ఉత్పత్తి రంగంలో ప్రవేశపెట్టరు. రెండవది: కొత్త ఆవిష్కరణలు వాటంతటఅవే నిజవేతనాలను పెంచడానికి దోహదం చేయలేవు. అప్పటికి లేబర్ మార్కెట్లో కార్మికులు తగినంత సంఖ్యలో లభ్యం కానిపరిస్థితులు ఉన్నప్పుడే కొత్త ఆవిష్కరణలు నిజవేతనాల పెరుగుదలకు తోడ్పడగలవు. మూడవ ప్రపంచ దేశాల మార్కెట్లను సామ్రాజ్యవాదులు చేజిక్కించు కున్న కారణంగా చరిత్రలో దీర్ఘకాలం పాటుపాశ్చాత్య దేశాల ఉత్పత్తుల మార్కెట్ విస్తరిస్తూ వచ్చిన్న అంతులేని కొనసాగాయి. బ్రిటన్లో మొదలైన పారిశ్రామిక విప్లవం పారిశ్రామిక పెట్టుబడిదారీ యుగానికి నాంది పలికింది. అక్కడ యంత్రాల ద్వారా తయారైన సరుకులకు మార్కెట్ను కల్పించడం మూడవ ప్రపంచ దేశాల చేతివృత్తుల మార్కెట్ను దెబ్బ తీయడం ద్వారా మాత్రమే సాధ్యపడింది. పశ్చిమ దేశాలలో వచ్చిన కొత్త ఆవిష్కరణలకు రెండో పార్శ్వంలో మూడవ ప్రపంచ దేశాల స్థానిక మార్కెట్ల వినాశనం కనిపిస్తుంది. దానితోబాటు పెద్ద ఎత్తున అ కుశల రిజర్వు శ్రామికులు (ఉపాధి కోల్పోయినవారు) తయారయ్యారు. సాంకేతిక పురోగతి కారణంగా నూతన ఆవిష్కర ణలు ప్రవేశపెట్టిన దేశాల్లో సైతం రిజర్వు శ్రామికులు తయారయ్యారు. అయితే,పశ్చిమ యూరప్ నుండి పెద్ద సంఖ్యలో శ్రామి కులు కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా తదితర సమశీతోష్ణ మండల దేశాలకు వలసలు పోయారు. ఇలా వలసలు పోయినవారు ఆకొత్త ప్రాంతాల్లో నివసిస్తున్న స్థానిక తెగల ప్రజలను పెద్దఎత్తున ఊచకోత కోశారు. వారిని అక్కడి నుండి వెళ్ళగొట్టారు. వారి భూములను ఆక్రమించుకుని అక్కడసాగు చేయడం ప్రారంభించారు. ఈభారీవలసల కారణంగా, ఏ దేశాల్లోనైతే కొత్త ఆవిష్కరణలు ఉత్పత్తిలో ప్రవేశపెట్టారో అక్కడ లేబర్ మార్కెట్లో కొంతవరకు కొరత కనిపించింది. అందువలన ఒకమేరకు నిజవేతనాల్లో పెరుగుదల వచ్చింది. కొత్త ఆవిష్కరణలు ఆ ప్రత్యేక పరిస్థితుల్లో ఉత్పాదకత పెరగడానికి, అదే సమయంలో నిజవేతనాలు పెరగడానికి దారి తీశాయి. కాని మూడవ ప్రపంచ దేశాల్లో పెరిగిన రిజర్వు శ్రామికులు యూరప్ కార్మికుల మాదిరిగా ఆ సమశీతోష్ణ మండల దేశాలకు వలసలు పోవడం సాధ్యపడలేదు.వాళ్ళు ప్రధానంగా ఉష్ణ మండల ప్రదేశాలకు మాత్రమే పరిమితం అయ్యారు. అక్కడ వేతనాల స్థాయి చాలా తక్కువగా ఉంటుంది.పైగా వలసలపై చాలా ఆంక్షలు కూడాఉంటాయి. నేటికీ అదే పరిస్థితి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పశ్చిమ యూరప్ దేశాల నుండి ఆ దేశాలకు పెట్టుబడిదారులు గనుక తరలివెళ్ళి అక్కడి తక్కువ వేతనాల స్థాయిని ఉపయోగించుకుని తమ వద్దనున్న కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడి ప్రపంచ మార్కెట్కు సరుకులను అందించివుంటే అప్పుడు పశ్చిమ దేశాలకు, మూడవ ప్రపంచ దేశాలకు మధ్య వేతనాల్లోని వ్యత్యాసాలు అంతరించి వుండేవి. కాని సమశీతోష్ణ మండల దేశాల నుండి పెట్టుబడి ఉష్ణమండల దేశాలకు ఆ విధంగా తరలిరాలేదు. కేవలం పరిశ్రమలకు కావలసిన ముడిసరుకుల ఉత్పత్తి రంగాలకు మాత్రమే వచ్చింది.

# ఆరోగ్య మిత్ర పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 10, (తెలంగాణ దిశ) :** జిల్లాలో ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి ఫీల్డ్ ఆపరేషన్స్లో ఖాళీగా ఉన్న ఆరోగ్య మిత్ర పోస్టులను భర్తీ చేయడానికి అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సి. ఉమాగౌరి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను హైదరాబాద్లోని తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (టీమ్స్), సనత్నగర్లో విధులు నిర్వహించేందుకు నియమించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ నియామక ప్రక్రియలో భాగంగా మొత్తం 40 ఆరోగ్య మిత్ర పోస్టులను ఔట్సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు గ్రాడ్యుయేషన్తో పాటు డీసీఏ అర్హత కలిగి ఉండాలన్నారు. సంబంధిత రంగంలో కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉండాలి. అలాగే స్థానిక అభ్యర్థులు మాత్రమే ఈ పోస్టులకు అర్హులని ఆమె తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా అధికారిక వెబ్సైట్ నుంచి దరఖాస్తు ఫారమ్ను డౌన్లోడ్ చేసుకోవాలని అధికారులు సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను మార్చి 11, 12, 13 మరియు 16 తేదీలలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తులను జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, అంతాయిపల్లిలో అందజేయాలని కోరారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారమ్తో పాటు విద్యార్హతలు, అనుభవానికి సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు రూ. 500 డిమాండ్ డ్రాఫ్ట్ను సమర్పించాలని తెలిపారు. అర్హత గల స్థానిక అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

# కొంపల్లి సర్కిల్లో స్వచ్ఛత చర్యలు

### - ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చర్యలు





**కుత్బుల్లాపూర్, మార్చి 10, (తెలంగాణ దిశ) :**తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు కొంపల్లి సర్కిల్ 56లో స్వచ్ఛత చర్యలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ సేవలు అందని గృహాలను గుర్తించి, ఆయా గృహాలకు స్వచ్ఛ సాథీలను అనుసంధానం చేశారు. ఎస్ఏటి బృందాలు ప్రాంతాలను సందర్శించి చెత్త సేకరణ సేవలు అందని గృహాలను గుర్తించి, వెంటనే సంబంధిత స్వచ్ఛ సాథీలకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు ఇంటింటి చెత్తను సరైన విధంగా అందజేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో మున్సిపాలిటీకి సహకరించాలని సూచించారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన జీవనానికి ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ ఎం. కృష్ణారెడ్డి పర్యవేక్షణలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలిసి విజయవంతంగా నిర్వహించారు.

# తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు మధుకు ఘనంగా సన్మానం




**భువనగిరి, మార్చి 10, (తెలంగాణ దిశ) :**తెలంగాణ ఉద్యమకారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ మెరుగు మధు నియమితులైన సందర్భంగా మంగళవారం ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వడపర్తి గ్రామ పరిధిలో ఎస్ఆర్ పాఠశాలలో యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సమావేశం సందర్భంగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రెడ్డి, అధ్యక్షులు పాలకూర్ల వెంకటేశం గౌడ్, కార్యదర్శి రామ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమం సందర్భంగా మధు చేసిన ఉద్యమాలను గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నాయకులు సోమిరెడ్డి, వంగూరు పాండు, తుంగతుర్తి రంగారావు, చిన్నప్ప మల్లికార్జున్, యాదయ్య, చారి కృష్ణారావు, మంజుల భాగ్యలక్ష్మి, శ్రీశైలం రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు



**కుత్బుల్లాపూర్, మార్చి 10, (తెలంగాణ దిశ) :**చింతల్లోని భాగ్యరథి డిగ్రీ కాలేజీలో యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడంతో పాటు వాటి వల్ల కలిగే ప్రమాదాలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జీడిమెట్ల పోలీస్ స్టేషన్కు చెందిన సీఐ మల్లేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాల గురించి వివరించారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకర అలవాట్లు అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునే దిశగా చదువుపై దృష్టి పెట్టి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాయుడు, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ధనుంజయ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యానికి, కుటుంబానికి, సమాజానికి కలిగే నష్టాల గురించి వివరించారు. డ్రగ్స్ వినియోగంపై పోలీసులు తీసుకుంటున్న కఠిన చర్యలను కూడా విద్యార్థులకు తెలియజేశారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ రాజ్, డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్ పాల్గొన్నారు. అదే విధంగా బీకాం, బీఎస్సీ, బీబీఏ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది హాజరయ్యారు.

# కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి



**కుత్బుల్లాపూర్, మార్చి 10, (తెలంగాణ దిశ) :** కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలను రకాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని బీసీ హక్కుల సాధన సమితి నాయకులు పాల బిందెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఈ విషయమై బాచుపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ ఉమామహేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రతి సంవత్సరం బడ్జెట్ లో రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామని వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. అదేవిధంగా వివిధ సామాజిక తరగతులకు ఆర్థిక సహాయ సహకారాలు, చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం వంటి ఎన్నో హామీలను ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. కాబట్టి వారం రోజులలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్ లో బీసీలకు రూ. 55 వేల కోట్లు కేటాయించి బీసీ డిక్లరేషన్ హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఇందిరమ్మ కాలనీ డివిజన్ కార్యదర్శి పొన్నగంటి దస్తగిరి తదితరులు ఉన్నారు.

# హనుమాన్ విగ్రహ నిర్మాణానికి రూ. 1,11,111 విరాళం



**కుషాయిగూడ, మార్చి 10, (తెలంగాణ దిశ) :**కుషాయిగూడ బస్టాండ్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న హనుమాన్ విగ్రహ నిర్మాణానికి సహకారంగా కాప్రా కాపు కులాల ఐక్యవేదిక అధ్యక్షులు, బీజేపీ సీనియర్ నాయకులు జివిఎన్ రావు రూ. 1,11,111/-లను విరాళంగా మంగళవారం చల్లా ప్రభాకర్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపు నిచ్చారు. సమాజంలో ఐక్యత, భక్తి భావాలను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చల్లా ప్రభాకర్ మాట్లాడుతూ తుది దశలో ఉన్న హనుమాన్ విగ్రహ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గణేష్ ముదిరాజు, కృష్ణవేణి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి




**హెచ్బి కాలనీ, మార్చి 10, (తెలంగాణ దిశ) :**ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని హెచ్బి కాలనీ డివిజన్ చైతన్య నగర్లో ఉన్న 240 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలపై బీజేపీ నాయకులు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా బీజేపీ హెచ్బి కాలనీ డివిజన్ అధ్యక్షుడు రామ్ ప్రదీప్ మునుగంటి మల్కాజిగిరి కమిషనరేట్ కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి ఐఏఎస్ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. ముందుగా ఈ విషయాలను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్కు తెలియజేయగా, ఆయన స్పందించి సంబంధిత సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి వెంటనే స్పందించి సంబంధిత డీసీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్రూమ్ రెసిడెన్సీ ప్రతినిధులు జాన్, ప్రభాకర్, చంద్రశేఖర్, అంజయ్య, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి గుర్తింపు పొందిన పాఠశాలల కృషి




**భువనగిరి, మార్చి 10, (తెలంగాణ దిశ) :**తెలంగాణ రాష్ట్ర విద్యాభివృద్ధిలో ట్రస్మా కృషి విశేషమైనదని రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వడపర్తి గ్రామ పరిధిలో ఎస్ఆర్ పాఠశాలలో యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పాఠశాల విద్యలో 65 లక్షల విద్యార్థులకు గాను 35 లక్షల మంది విద్యార్థులను గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు తక్కువ ఫీజుతో విద్యా సేవ చేస్తున్నామని అన్నారు.

ప్రొఫెషనల్ టాక్స్, ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్, అన్ని రకాల టాక్సు కడుతూ అటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా సహకరిస్తున్నామని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పాలకూర్ల వెంకటేశం గౌడ్ కార్యదర్శి రామ్, గౌరవ సలహాదారులు డాక్టర్ మెరుగు మధు, సోమిరెడ్డి, వంగూరు పాండు, తుంగతుర్తి రంగారావు, చిన్నప్ప మల్లికార్జున్, యాదయ్య, చారి కృష్ణారావు, మంజుల భాగ్యలక్ష్మి, శ్రీశైలం రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హాంకాంగ్ ఘటన నుంచైనా గుణపాఠాలు నేరుస్తారా

హైదరాబాద్ విశ్వనగరంలా అభివృద్ధి చెందుతున్నది. నగరం నలువైపులా విస్తరిస్తున్నది. ఎటూ చూసినా బహుళ అంతస్తులే వెలుస్తున్నాయి. ఆకాశమే హద్దుగా యేడాదికి ఏడాది అంతస్తులు పెరుగుతున్నాయి. వాటి భద్రతకు భరోసా ఎక్కడుంది.. అగ్నిప్రమా దాలు సంభవిస్తే.. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే అగ్నిమాపక వ్యవస్థ ఉందా అంటే లేదనే సమాధానం వస్తోంది.

అగ్నిప్రమాదాన్ని నియంత్రించే పరికరాలు అందుబాటులో ఉన్నాయా అంటే..అవేమీ లేవంటున్నారు. ఇటీవల హాంకాంగ్లో జరిగిన అగ్ని ప్రమాదాలు వస్తే ప్రాణాలకు భద్రత ఏదని బహుళ అంతస్తుల్లో నివసిస్తున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం అనుకోకుండా వచ్చేది అలాంటి ప్రమాదాలను ఎదుర్కొవడానికి కావాల్సిన పరికాలు, యంత్రాలు ప్రభుత్వం దగ్గర సిద్ధంగా ఉండాలి.. కాని మన తెలంగాణ ప్రభుత్వం మాత్రం అలాంటి ఆలోచనే చేయడం లేదు.. హైదరాబాద్తోపాటు ఇతర ప్రధాన నగరాల్లో తరుచూ అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ ఆస్తి నష్టంతోపాటు ప్రాణ నష్టం కూడా జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల హాంకాంగ్లో 30 బహుళ అంతస్తుల సముదాయంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో వందల సంఖ్యలో మరణాలు చోటు చేసుకున్నాయి. అలాంటి ఘటనల నుంచి కండ్లు తెరవాల్సిన అవసరముంది. హైదరాబాద్లో 18 అంతస్తుల భవనాల్లో ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగిందంటే నివారించేందుకు కావాల్సిన యంత్రాలు మన అగ్నిమాపక శాఖ దగ్గర లేవు.అంటే18 అంతస్తులపైన ప్రమాదం జరిగిందంటే ప్రభుత్వం చేతెలెత్తేసే పరిస్థితి. హైదరాబాద్ మహానగరం విశ్వనగరంలా అభివృద్ధి చెం దుతూ నలువైపులా విస్తరిస్తున్నది. ఎటూ చూసినా బహుళ అంతస్తులే వెలుస్తున్నాయి. 63 అంతస్తుల వరకు అపార్ట్మెంట్ నిర్మాణాలకు హెచ్ఎండీఏ అనుమతులు ఇవ్వడంతో ఆకాశమే హద్దుగా యేడాదికి ఏడాది అంతస్తులు పెరుగుతున్నాయి. ఇలా బహుళ అంతస్తుల భవనాలు పెరుగుతున్నా, వాటి భద్రతకు భరోసా ఎక్కడుంది.. ఉహించని అగ్నిప్రమాదాలు సంభవిస్తే, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే వ్యవస్థ అగ్నిమాపక శాఖ వద్ద ఉందా అంటే లేదనే సమాధానం వస్తోంది. 18 అంతస్తులకుపైన ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే అక్కడ మంటలను ఎలా అర్పేస్తారు, అక్కడ చిక్కుకున్న వారిని ఎలా రక్షిస్తారు, అగ్నిప్రమాదాన్ని నియంత్రించే పరికరాలు అందుబాటులో ఉన్నాయా అంటే.. అవేమి లేవనే సమా ధానాలు వస్తుండడంతో నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం యుద్ధ ప్రతిపాదికన అగ్నిమాపక శాఖలో ప్రమాదాలను నివారించేందుకు కావాల్సిన అత్యాధునిక పరికరాలను సమకూర్చాల్సిన అవసరం ఉంది. ఇతర రాష్ట్రాలు, దేశాలు ఏ విధంగా పరికరాలను సమకూర్చు కుంటున్నాయో ఒక స్నోర్కెల్, మల్టీపర్పస్ టెండర్లు 68, అడ్వాన్స్ వాటర్ టెండర్లు 9, వాటర్ కమ్ ఫోమ్ టెండర్లు 9,160 వాటర్ టెండర్లు, 18 మినీ వాటర్ టెండర్లు, 21 వాటర్ బ్రౌజర్లు, ఐదు వాటర్ లారీలు, 29 మిస్ట్ జీప్ ఇలా ప్రమాదాలను నిలువరించేందుకు ఉపయోగించే వాహనాలు అగ్నిమాపక శాఖ వద్ద 827 ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

# నందనంపాటి రాముకు "అన్నదాన సేవా చక్రవర్తి" అవార్డు ప్రధానం





కా(ప్రా,మార్చి 10, (తెలంగాణ దిశ) : తులసమ్మా చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్, సోలిస్ ఐ కేర్ సిఎండి నందనంపాటి రామాంజనేయులుకు ఆలయ 27వ పీఠాధిపతి మహా సన్నిధానం శ్రీ లా శ్రీ కైలై మాసిలామణి దేశిక జ్ఞాన సంబంధ పరమాచార్య స్వామిగళ్ చేతుల మీదుగా అందజేశారు. పాండిచ్చేరిలోని తిరునల్లార్‌లో గల ప్రసిద్ధ ధర్బరణ్యేశ్వర స్వామి ఆలయంలో శని పేర్చి పవిత్ర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుంభ రాశి నుండి మీన రాశికి శని గ్రహం మారిన సందర్భంగా ఈ నెల 6వ తేదీ నుండి 45 రోజులపాటు ప్రత్యేక ఉత్సవాలను ఆలయ అధికారులు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా మార్చి 6, 7, 8 తేదీలలో సుమారు ఆరు లక్షల మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి శని భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి రెండున్నర సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ శని పేర్చి ఉత్సవాలకు దేశం నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు. ఆలయ 27వ పీఠాధిపతి మహా సన్నిధానం శ్రీ లా శ్రీ కైలై మాసిలామణి దేశిక జ్ఞాన సంబంధ పరమాచార్య స్వామిగళ్ వారి ఆశీర్వాదాలతో ఈ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తులసమ్మ చారిటబుల్ ఫౌండేషన్, సోలిస్ హాస్పిటల్ చైర్మన్ నందనపాటి రాము ఆధ్వర్యంలో సుమారు రెండు లక్షల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఐదవ సారి నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఆలయంలో హోమాలు, శని భగవానుడి అభిషేకాలు నిర్వహించగా నందనపాటి రాము కుటుంబ సభ్యులు, సోలిస్ హాస్పిటల్ సిబ్బంది భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ధర్బరణ్యేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ శివ శ్రీ టి. రాజస్వామి నాథ శివాచార్యులు, మాలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరికపూడి గాంధీ, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హరివర్ధన్ రెడ్డి, హుజురాబాద్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి, కరైకల్ జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లక్ష్మీ సౌజన్య, కరైకల్ కలెక్టర్ ఇషితా రాఠి, ఈఓ సుబ్రమణ్యం, కాప్రా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, శంకర్ బాబు, విజయేందర్ రెడ్డి, గజేందర్, మోహన్, అరికపూడి ప్రసాద్, డాక్టర్ కె. వెంకటేశ్వర ప్రసాద్, డాక్టర్ కోటేశ్వరరావు, యుఎస్ఏ బాలాజీ, వెంకట రాజు, మేధా సురేష్, మాజీ ఏపీ లేబర్ కమిషన్ శ్రీనివాసరావు తదితరులతో పాటు సోలిస్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధిక యూరియా.. భూమికి చేటు

## కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు



కమాన్ పూర్ : రైతుల్లో అధిక యూరియా మరియు రసాయనిక ఎరువుల వినియోగం వల్ల వ్యవసాయ భూము లపై ఏర్పడుతున్న దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు ఒక అవగాహన కార్యక్రమంను కమాన్ పూర్ మండలంలోని లింగాల గ్రామము, కామాన్ పూర్ మండలం లో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం రామగిరిఖిల్ల వారు నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం మరియు మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ మాట్లాడుతూ, అవసరానికి మించి యూరియా, రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూసారము తగ్గిపోవడం, పోషక లోపాలు ఏర్పడటం, పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా పంటలు పడిపోవడం, పురుగులు-తెగుళ్ల తీవ్రత పెరగడం, సాగు వ్యయం అధికమవడం వంటి సమస్యలు రైతులను ఆర్థికంగా నష్టపరుస్తున్నాయని వివరించారు. ఈ సమస్యలకు పరిష్కారంగా పచ్చి ఎరువుల (గ్రీన్ మాన్యూరింగ్)వినియోగాన్ని విస్తృతంగా చేపట్టాలని సూచించారు. సున్నంపప్పు, దైన్చా, సనంపు వంటి పచ్చి ఎరువు పంటలను సాగు చేయడం ద్వారా మట్టిలో సేంద్రియ పదార్థం పెరిగి, నేల నిర్మాణం మెరుగుపడుతుందని తెలిపారు. దీని వల్ల రసాయనిక ఎరువులపై ఆధారపడకుండానే భూసారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. అదేవిధంగాభూసార పరీక్షల (సాయిల్ టెస్టింగ్) ప్రాధాన్యతను నిపుణులు ప్రత్యేకంగా వివరించారు. భూమిలో ఉన్న పోషక స్థాయిలను తెలుసుకుని, పంట అవసరానికి తగిన మోతాదులోనే ఎరువులు వాడటం వల్ల అధిక వినియోగాన్ని నివారించవచ్చని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయడం ద్వారా దిగుబడులు మెరుగుపడతాయని అన్నారు.యూరియాను విడతలుగా (స్ప్లిట్ అప్లికేషన్) పంట దశలకు అనుగుణంగా వేయాలని రైతులకు సూచించారు. ఒకేసారి ఎక్కువ మోతాదులో యూరియా వేయడం వల్ల పోషకాలు వృథా అవుతాయని, విడతలుగా వేస్తే పోషకాల వినియోగ సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. మొత్తంగా సేంద్రియ ఎరువులు, పచ్చి ఎరువులు, భూసార పరీక్షలు, సమతుల్య ఎరువుల వినియోగం వంటి పద్ధతులు పాటిస్తే వ్యవసాయం సుస్థిరంగా సాగుతుందని, భవిష్యత్తు తరాలకు సారవంతమైన నేలను అందించవచ్చని ఈ అవగాహన కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ పిల్లి, డాక్టర్ వినోద్ కుమార్ మరియు కామాన్ పూర్ మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ , లింగాల వ్యవసాయ విస్తరణ అధికారి, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్ట చర్యలు

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ సంకీర్త్ తో కలిసి రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, రవాణా, టీజీఎండీసీ తదితర శాఖల అధికారులతో ఇసుక అక్రమ రవాణాపై చేపట్టాల్సిన చర్యలపై సమీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గతంలో మాన్యువల్ కూపన్ల ద్వారా ఉచితంగా ఇసుక అందించామని, ఇకపై ఆ విధానాన్ని పూర్తిగా నిలిపివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇకపై జిల్లాలో ఇసుక అవసరమైన లబ్ధిదారులు తప్పనిసరిగా "మన ఇసుక వాహనం" యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ విధానం ద్వారా ఇసుక పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. త్వరలోనే తహసీల్దార్లు, టీజీఎండీసీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలపై విశ్లేషణ చేస్తామని అన్నారు. జిల్లాలోని ఇసుక రీచ్‌లను గుర్తించేందుకు ఇరిగేషన్, టీజీఎండీసీ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ట్రాన్స్‌పోర్ట్ అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టి ఓవర్‌లోడింగ్‌లను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా, అక్రమ నిల్వలు, అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలించినా, అక్రమ డంపులు ఏర్పాటు చేసినా చర్యలు తప్పవని తెలిపారు.

పోలీసులతో కలిసి నిరంతరం తనిఖీలు చేపడతామని, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. ఇసుక రీచ్‌లు, వాగుల నుంచి ఇసుక తరలించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తామని, అక్రమ ఇసుక రవాణా చేస్తే వాహనంతో పాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అ ఆర్డీఓ హరి కృష్ణ, ఇరిగేషన్ శాఖ ఈఈ బసవ ప్రసాద్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు హార్దిక శుభాకాంక్షలు...



## బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి

హైదరాబాద్, మార్చి 10, (తెలంగాణ దిశ) : తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్ గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లాకు బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొల్లి మాధవి మాట్లాడుతూ శివ ప్రతాప్ శుక్లా విశాలమైన రాజకీయ అనుభవం, ప్రజా సమస్యలపై అవగాహన, రాజ్యాంగ పట్ల ఉన్న గౌరవంతో రాష్ట్రానికి సమర్థవంతమైన మార్గదర్శకత్వం అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాసేవకు ఆయన అంకితభావంతో పనిచేసిన నేతగా దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగేందుకు గవర్నర్‌గా ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆమె అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగంతో సమన్వయం సాధిస్తూ ప్రజల సంక్షేమం, రాజ్యాంగ పరిరక్షణలో ఆయన నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల ఆశయాలకు అనుగుణంగా పరిపాలన మరింత బలోపేతం కావాలని, శాంతి భద్రతలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో గవర్నర్‌గా ఆయన విలువైన సూచనలు అందిస్తారని మాధవి తెలిపారు. ఈ సందర్భంగా శివ ప్రతాప్ శుక్లా తెలంగాణ రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతూ, విజయవంతంగా తన బాధ్యతలు నిర్వహించాలని కోరుతూ మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



# భారతి సిమెంట్స్‌పై గురి!




ఒంగోలు, : ఏదైనా చెబితే హేతుబద్ధత ఉండాలి. అబద్ధం చెప్పినా నమ్మినట్టు ఉండాలి. కానీ ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి తరచూ ఫెయిల్ అవుతున్నారు. ఇటీవల మీడియా ముందుకు వచ్చి మళ్లీ అమరావతి పై లేనిపోని మాటలు మాట్లాడారు. ఇప్పుడిప్పుడే జగన్ విషయాన్నీ మరిచిపోతున్న అమరావతి రైతులను మళ్లీ కెలికారు. నది గర్భంలో అమరావతిని కడుతున్నారు అంటూ నిందలేశారు. అయితే రెండో విడత భూసేకరణకు దిగుతున్న ప్రభుత్వంపై అమరావతి రైతులు అసంతృప్తితో ఉన్నారు. జగన్ ఆ మాటలు అనేసరికి వారంతా తమ అసంతృప్తి తగ్గించుకున్నారు. తమ శాశ్వత శత్రువు జగన్మోహన్ రెడ్డి అని బలంగా నమ్మడం ప్రారంభించారు. డామిట్ కథ అడ్డం తిరిగింది అంటూ సజ్జల రామకృష్ణారెడ్డి ఎంట్రీ ఇచ్చారు. జగన్ మాటలను వక్రీకరించారని సంజాయిషి ఇవ్వడం ప్రారంభించారు. అమరావతి తో వదల్లేదు జగన్. ఏపీ నుంచి పరిశ్రమలు వెళ్లిపోతున్నాయని కూడా వ్యాఖ్యానించారు. అందులో భారతి సిమెంట్స్ గురించి ప్రస్తావించారు ఇప్పుడు అందరూ ఆశ్చర్యపోతున్నారు.జగన్ అధికారంలో ఉన్నప్పుడు చాలా కంపెనీలు పెట్టుబడుల పేరుతో ఏపీలో ఆస్తులు ఆక్రమించుకుంటాయి. జగన్ అధికారంలో లేకపోతే వాటి దగ్గర పెట్టుబడులకు డబ్బులు ఉండవు. అయితే పారిపోయిన పరిశ్రమల జాబితాలో జగన్మోహన్ రెడ్డి భారతి సిమెంట్స్ ను చేర్చడం చాలామంది ఆశ్చర్యానికి కారణం అయింది. ప్రభుత్వం వేధిస్తున్నందున తమ సంస్థను కూడా తరలిస్తామని జగన్ చెబుతున్నారు. అయితే ప్రభుత్వం అక్రమంగా ఆయన కేటాయింపు చేసుకున్న భూముల లీజు విషయంలో నోటీసులు మాత్రమే ఇచ్చింది. దానిని వేధింపులుగా భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. జగన్ అధికారంలో ఉన్నప్పుడే తన కుటుంబ సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా వేల కోట్ల రూపాయల విలువైన గనులను కట్టబెట్టారు. భారతి సిమెంట్స్ కు కేటాయించిన లీజుల్లో నిబంధనలను ఉల్లంఘించారని తేలడంతో.. కూటమి ప్రభుత్వం ఆ లీజులను రద్దు చేసేందుకు సిద్ధపడింది. దానిని పరిశ్రమలను తరిమివేయడం అంటారా?అసలు భారతి సిమెంట్స్ ఏర్పాటు అక్రమమని ఆరోపణలు ఉన్నాయి.. భారతి సిమెంట్స్ అసలు పేరు అది కాదు. రఘురాం సిమెంట్స్. 2004లో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత.. ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి ఆ కంపెనీని కొనుగోలు చేశారు. రఘురాం సిమెంట్స్ కంపెనీకి సున్నపురాయి లీజులు ఉన్నాయి. భారతి సిమెంట్స్ గా మారిన తర్వాత ఆ లీజులను ఆ కంపెనీ వాడుకుంది. ఇటువంటి పరిస్థితుల్లో గనుల విషయంలో కేంద్రం స్పష్టమైన పాలసీని తీసుకొచ్చింది.

ఓ కంపెనీ పేరుతో లీజులు తీసుకొని.. మరో కంపెనీ టేక్ ఓవర్ చేస్తే లీజులు చెల్లవు అని స్పష్టం చేసింది. 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వం రఘురాం సిమెంట్స్కు ఇచ్చిన ప్రాథమిక అనుమతిని కూడా రద్దు చేసింది.2019లో ఏపీలో అధికారం మారిన తర్వాత సీన్ చేంజ్ అయింది. కొన్ని రకాల న్యాయపరమైన అంశాలను తెరపైకి తెస్తూ లీజులను పునరుద్ధరించుకున్నారు. అయితే హైకోర్టు ఈ విషయంలో కొన్ని రకాల సూచనలు చేసిన పట్టించుకోలేదు. సరిగ్గా 2024 ఎన్నికలకు ముందు లీజులను పునరుద్ధరిస్తూ జీవోలు జారీచేశారు. దీనిపై కేంద్రానికి ఫిర్యాదు వెళ్ళింది. విచారణ చేయాలని రాష్ట్రానికి కేంద్రం లేఖ రాసింది. దీంతో అసలు విషయం బయటపడింది. రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు ఇవ్వడంతో పరిశ్రమలను తరిమేస్తున్నారన్న ప్రచారం మొదలుపెట్టారు జగన్.

# చంద్రబాబుకు తలనొప్పిగా సొంత మనుషులు



విజయవాడ, : చంద్రబాబు నాయుడుకు ఇప్పుడు సొంత సామాజికవర్గంలోనే శత్రువులు ఎక్కువయ్యారు. ప్రత్యర్థులు చేసే విమర్శలను పెద్దగా పట్టించుకోవాల్సిన పనిలేదు. కానీ సొంత సామాజికవర్గం నేతలే చంద్రబాబు ప్రతి నిర్ణయాన్ని తప్పపడుతుండటం ఆయనకు రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెడుతుందనే చెప్పాలి. ఒకరకంగా చంద్రబాబు నాయుడుకు బయట శత్రువులతో కంటే ఇంట్లో శత్రువులతో యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఈసారి కనిపిస్తుంది. ప్రధానంగా ఈసారి మాత్రం కమ్మ సామాజికవర్గం నేతలు మాత్రమే ఆయనను రాజకీయంగా ఇరకాటంలోకి నెడుతున్నారని చెప్పాలి. అందులో ప్రధానంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఏబీ వెంకటేశ్వరరావు, ముప్పవరపు వెంకయ్య నాయుడులు ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలు ఇబ్బందికరంగా మారాయి.వడ్డే శోభనాద్రీశ్వరరావు మాజీ టీడీపీ నేత. చంద్రబాబు మంత్రివర్గంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు రాజకీయంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితేనేం రాజధాని అమరావతి విషయంలో చంద్రబాబు నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. చంద్రబాబు వ్యతిరేక మీడియాతో పాటు సోషల్ మీడియాలో కూడా వడ్డే ఇంటర్వ్యూలతో చెలరేగిపోతున్నారు. చంద్రబాబు రాజధాని పేరిట రైతులను నిలువునా ముంచుతున్నారంటూ వడ్డే శోభనాద్రీశ్వరరావు పదే పదే వ్యాఖ్యానిస్తున్నారు. తొలిదఫా ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చిన రైతులు ఇబ్బందులను చూసైనా రెండో విడత భూ సమీకరణకు సహకరించవద్దంటూ రైతులకు వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిస్తున్నారు. పచ్చని పంటలు పండే భూములను సర్వనాశనం చేస్తున్నారని, కలల్లో చంద్రబాబు విహరిస్తున్నారని ఫైర్ అవుతున్నారు. మరో ఎయిర్ పోర్టు, మరో ఆరులేన్ల రహదారి అవసరమా? అని ప్రశ్నిస్తున్నారు.ఇక ఏబీ వెంకటేశ్వరరావు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇంటలిజెన్స్ చీఫ్ గా పనిచేశారు. తర్వాత పదవీ విరమణ చేశారు. కానీ ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద పదవి వస్తుందని ఏబీ వెంకటేశ్వరరావు భావించారు. పోలీసు కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమించారు. దానిని తీసుకునేందుకు ఏబీ వెంకటేశ్వరరావు ఇష్టపడలేదు. పైగా రాష్ట్రంలో కొత్త పార్టీ పెడతానని చెబుతున్నారు. అలాగే యాభై వేల ఎకరాలు తొలి విడత సేకరించిన భూమిని ఎవరెవరికిచ్చారో లెక్కలు చెప్పాలంటూ ఏబీ వెంకటేశ్వరరావు మీడియా ద్వారా నిలదీస్తున్నారు. ఇది కూడా చంద్రబాబుకు ఇబ్బందికరమే. ఇక మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఇటీవల మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను తప్పుపట్టేలా మాట్లాడటం కూడా బాబు సర్కార్ ను ట్రబుల్ లోకి నెట్టింది. విద్య, వైద్యం మాత్రం ఉచితంగా పేదలకు అందించాలని, మిగిలిన పథకాలను రద్దు చేయాలంటూ వెంకయ్య నాయుడు చేసిన వ్యాఖ్యలు జగన్ తో పాటు చంద్రబాబుకు కూడా తగిలినప్పటికీ ఎక్కువ డ్యామేజీ చంద్రబాబుకే నంటున్నారు. అలా ఈ ముగ్గురు చేస్తున్న వ్యాఖ్యలు చంద్రబాబుకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి

# అర్బన్ ఛాలెంజ్ ఫండ్

కేంద్ర బిజెపి ప్రభుత్వం పట్టణాల్లో మంచినీరు, మురుగు నీరు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇతర మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు, పట్టణాలను ఆర్థిక వృద్ధికి చోదక శక్తులుగా, సృజనాత్మక పునరాభివృద్ధి కేంద్రాలుగా నిర్మించడం పేర అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యు.సి.ఎఫ్) పథకాన్ని ప్రకటించింది. 2026 నుండి 2031 వరకు ఐదేళ్ల పాటు ఈ పథకం అమలులో ఉంటుంది. ఈ పథకాన్ని ప్రపంచ బ్యాంకు అనుబంధ సంస్థ అయిన ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఎ.డి.బి) రూపొందించింది.

వాస్తవంగా దీనిని 2025-26 బడ్జెట్‌లోనే ప్రవేశ పెట్టారు. ఎ.డి.బి రుణాన్ని మంజూరు చేయకపోవడంతో అమల్లోకి రాలేదు. 2026-27 బడ్జెట్‌లో తిరిగి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ పథకానికి దశల వారీగా రాబోయే ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు కేంద్ర ప్రభుత్వానికి ఎ.డి.బి రుణం రూపంలో ఇస్తుంది. దీని అమలును కూడా ఎ.డి.బి ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేస్తుంది.

దేశ పట్టణ జనాభా 2036 నాటికి 40 శాతానికి చేరుతుందని, స్థూల జాతీయోత్పత్తిలో 70 శాతానికి పట్టణాలు, నగరాలు ప్రాతినిధ్యం వహిస్తాయని, రాబోయే 15 ఏళ్లలో దేశంలో పట్టణాలు, నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కనీసం రూ.75 లక్షల కోట్లు (840 బిలియన్ డాలర్లు) పెట్టుబడులు అవసరమని ప్రపంచబ్యాంకు భారతదేశ పట్టణ మౌలిక సదుపాయాలపై 2022లో విడుదల చేసిన నివేదిక తెలిపిందని తాజాగా విడుదల చేసిన 2025-26 ఆర్థిక సర్వే పేర్కొన్నది. అంటే ఏడాదికి సుమారు రూ.4.5 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టాలని, ఇది స్థూల జాతీయ ఉత్పత్తి (జి.డి.పి)లో 1.2 శాతంగా ఉంటుందని, ఇంత పెట్టుబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టలేవని, ప్రైవేట్ మార్కెట్ ఫైనాన్స్ నుండి సమీకరించుకోవాలని మోడీ ప్రభుత్వం చెబుతున్నది.

ఇప్పుడు యు.సి.ఎఫ్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పట్టణ స్థానిక సంస్థలకు మౌలిక సదుపాయాల కల్పనకు ఇచ్చే గ్రాంట్ల నుండి వైదొలగి బహిరంగ మార్కెట్ నుండి రుణాల ద్వారా నిధులు సేకరించుకొని మౌలిక సదుపాయాలు చేపట్టాలని ఆదేశిస్తున్నది. ఈ పథకం పెద్ద పెద్ద నగరాలకే పరిమితం కాదు. దేశంలో ఉన్న అన్ని నగరాలతో పాటు మొత్తం 4,223 టైర్ 1, టైర్ 2 పట్టణాలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేశారు. చిన్న చిన్న పట్టణాలకు ప్రత్యేకంగా ప్రైవేట్ మార్కెట్ నుండి రుణాలు సేకరించుకోవటానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకంలో ప్రత్యేకంగా మార్కెట్ సంస్థలకు రిస్క్ హామీగా రూ.5 వేల కోట్ల రుణ హామీ నిధిని కూడా ఏర్పాటు చేస్తున్నది.

పట్టణ ఛాలెంజ్ నిధి మొత్తం రూ.4 లక్షల కోట్లుగా నిర్ణయించారు. రాబోయే ఐదేళ్లలో పట్టణాల్లో ఖర్చు పెట్టాలి. ఈ మొత్తం నిధిని కేంద్ర ప్రభుత్వం ఇవ్వదు. ఇందులో కేవలం 25 శాతం (రూ.లక్ష కోట్లు) మాత్రమే ఇస్తుంది. మిగిలిన రూ.మూడు లక్షల కోట్ల నిధులు సమకూర్చు కోవటానికి కొన్ని షరతులు విధించింది. రూ.4 లక్షల కోట్లలో కనీసం 50 శాతం నిధులను ప్రైవేట్ రుణాల ద్వారా, మున్సిపల్ బాండ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) రూపంలో సమకూర్చుకోవాలి. మిగిలిన 25 శాతం అనగా రూ.లక్ష కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, పట్టణ స్థానిక సంస్థలు భరించాలి లేదా వీటిని కూడా రుణాలు, బాండ్ల రూపంలో సమకూర్చుకోవాలి. ఈ పథకంలో మౌలిక సదుపాయాలను తప్పనిసరిగా ప్రభుత్వ, ప్రైవేట్, భాగస్వామ్యంలో చేపట్టాలి.

గత రెండున్నర దశాబ్దాల నుండి ప్రపంచబ్యాంక్ ఆదేశిత సంస్కరణలు పట్టణ రంగంలో తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్నప్పటికీ, ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం పట్టణ రంగంలో అమలు చేసిన వివిధ పథకాలకు తప్పనిసరిగా ప్రైవేటు రుణం తీసుకోవాలని, కార్పొరేట్ బాండ్లు సేకరించాలని, పిపిపి కింద ప్రాజెక్టులు చేపట్టాలని షరతులు లేవు. 2005-12 మధ్య అమలు చేసిన జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ ఆధునీకరణ మిషన్ (జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం) గాని, 2015-25 మధ్య అమలు చేసిన స్మార్ట్ సిటీ పథకంలో గానీ ఈ నిబంధనలు తప్పనిసరి చేయలేదు. జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎంలో కేంద్రం 70 శాతం, రాష్ట్రాలు, పట్టణ స్థానిక సంస్థలు 30 శాతంగాను, స్మార్ట్ సిటీ పథకంలో కేంద్రం 50 శాతం, రాష్ట్రాలు 50 శాతం నిధులు భరించేలా రూపొందించి అమలు చేశాయి. అయితే ఇవి కూడా సంస్కరణతో ముడిపెట్టి అమలు చేసినవే.

దేశంలో నేటికి పెద్దపెద్ద మెట్రోపాలిటిన్ నగరాలు మాత్రమే ప్రభుత్వ బ్యాంకుల నుండి పరిమిత స్థాయిలోనే రుణాలు, మున్సిపల్ బాండ్ల రూపంలో నిధులు సేకరిస్తున్నాయి. ఇప్పటివరకు మున్సిపల్ బాండ్ల రూపంలో దేశంలో 10 నగరాలు మాత్రమే రుణాలు సేకరించాయి. 2018లో రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కూడా అమరావతి బాండ్స్ పేర రెండు వేల కోట్లు రుణం సమీకరించింది. ఈ రుణాలు మొత్తం కూడా రూ.3,783 కోట్లు మాత్రమే. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పట్టణ స్థానిక సంస్థలు నిధుల కోసం ఆధారపడకుండా మార్కెట్ రుణాలు, మున్సిపల్ బాండ్ల రూపంలో సేకరించుకోవాలని షరతులు విధించింది. అలా సేకరించుకుంటేనే కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ వ్యయంలో 25 శాతం గ్రాంట్ ఇస్తుంది. ఈ బాండ్లను కూడా బడా కార్పొరేట్ సంస్థల నుండి సేకరించే నగర పాలక సంస్థలకు నగదు ప్రోత్సాహకాలు కూడా ప్రకటించింది. ఉదాహరణకు ఏదైనా నగర పాలక సంస్థ రూ.1000 కోట్ల విలువగల ఒకే మున్సిపల్ బాండ్‌ను కార్పొరేట్ సంస్థల నుండి సేకరిస్తే ఆ నగర పాలక సంస్థకు రూ.100 కోట్ల ప్రోత్సాహక నిధిని ఇస్తామని తెలిపింది.

# పశ్చిమాసియా సంక్షోభం..

**భారత్ లో చిక్కుకుపోయిన విదేశీ క్రికెట్ జట్ల కోసం ప్రత్యేక విమానాలు**
**మిడిల్ ఈస్ట్ గగనతల ఆంక్షలతో విమాన సర్వీసులకు అంతరాయం**
**ఐసీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక చార్టర్డ్ విమానాల్లో జట్ల పయనం**
**నేడు ముంబై నుంచి లండన్‌కు బయలుదేరనున్న ఇంగ్లండ్ టీమ్**
**రేపు కోల్‌కతా నుంచి వెళ్లనున్న వెస్టిండీస్, దక్షిణాఫ్రికా జట్లు**
**ఆరు రోజులుగా కోల్‌కతాలోనే**



## చిక్కుకుపోయామన్న విండీస్ కోచ్

టీ20 ప్రపంచకప్ 2026లో తమ పోరాటం ముగిసినప్పటికీ, స్వదేశానికి వెళ్లలేక భారత్‌లోనే చిక్కుకుపోయిన విదేశీ జట్ల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న యుద్ధ వాతావరణం, గగనతల ఆంక్షల కారణంగా విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వెస్టిండీస్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్ల కోసం ఐసీసీ ప్రత్యేక చార్టర్డ్ విమానాలను ఏర్పాటు చేసింది. ఈ వారాంతంలో ఈ మూడు జట్లు భారత్ నుంచి బయలుదేరనున్నాయి. శనివారం సాయంత్రం ఇంగ్లండ్ జట్టు ముంబై నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా లండన్‌కు బయలుదేరనుంది. ఇక మార్చి 1న భారత్ చేతిలో ఓడి సూపర్-8 దశలోనే నిష్క్రమించిన వెస్టిండీస్ జట్టు, సెమీస్‌లో కివీస్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా జట్లు కోల్‌కతాలోనే ఉండిపోయాయి. ఈ రెండు జట్లు ఆదివారం ఒకే చార్టర్డ్ విమానంలో కోల్‌కతా నుంచి జోహన్నెస్‌బర్గ్‌కు వెళ్లనున్నాయి. అక్కడి నుంచి ఆ విమానం విండీస్ ఆటగాళ్లతో ఆంటిగ్వాకు వెళ్లనున్నట్లు సమాచారం. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై దాడులు జరపడంతో మిడిల్ ఈస్ట్ మీదుగా వెళ్లే విమానాలకు ఆటంకం ఏర్పడటమే ఈ జాప్యానికి ప్రధాన కారణం. కాగా, వెస్టిండీస్ కోచ్ డారెన్ సామీ శనివారం 'డే 6' అంటూ తాము కోల్‌కతాలో చిక్కుకుపోయి ఆరు రోజులయిందని ట్వీట్ చేశారు. మరోవైపు విండీస్ స్పిన్నర్ అకీల్ హొసేన్.. "క్రిస్టియానో రొనాల్డో తన జెట్ పంపి నన్ను రక్షించడం బెటర్" అంటూ సోషల్ మీడియాలో సరదాగా పోస్ట్ చేశారు. అంతకుముందు జింబాబ్వే జట్టు కూడా ఢిల్లీలో ఇలాగే ఇబ్బంది పడగా, ఐసీసీ గురువారం అడిస్ అబాబా మీదుగా వారిని హరారేకు పంపించింది.

# భారతీయులు చాలా మంచి వాళ్లు

**సముద్రంలో ఉన్న రష్యా ఆయిల్ కొనుగోలుకు భారత్‌కు అమెరికా అనుమతి**
**ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఇంధన కొరత తీర్చేందుకు నిర్ణయం**
**భారతీయులు మంచివాళ్లంటూ అమెరికా ట్రెజరీ సెక్రటరీ ప్రశంసలు**
**వచ్చే నెల 4వ తేదీ వరకు రష్యా ఆయిల్ దిగుమతికి తాత్కాలిక వెసులుబాటు**
**ఇంధన ధరల నియంత్రణ కోసమే ఈ నిర్ణయమని వెల్లడించిన అమెరికా**



పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలో అంతరాయం కలగకుండా చూసేందుకు అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేసేందుకు భారత్‌కు 'ప్రత్యేక అనుమతి' ఇచ్చింది. ఇప్పటికే ట్యాంకర్ నౌకలలో రవాణాకు సిద్ధంగా ఉన్న రష్యా ఆయిల్‌ను కొనుగోలు చేసేందుకు అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ భారత్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయాన్ని ట్రంప్ సన్నిహితుడు, యుఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ వెల్లడించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. "భారతీయులు చాలా మంచివాళ్లు. రష్యా ఆయిల్ కొనవద్దు అని చెప్పాం... వారు (భారతీయులు) మేం చెప్పినట్టే ఆపేశారు. ఆ లోటును అమెరికా ఆయిల్ తో భర్తీ చేయాలని ప్రయత్నించారు. అయితే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన చమురు సరఫరా గ్యాప్‌ను తగ్గించడానికి, సముద్రంలో సిద్ధంగా ఉన్న రష్యా ఆయిల్‌ను కొనుగోలు చేసేందుకు వారికి (భారత్ కు) అనుమతి ఇచ్చాం" అని తెలిపారు. ఈ వెసులుబాటు ఏప్రిల్ 4 వరకు అంటే 30 రోజుల పాటు మాత్రమే అందుబాటులో ఉంటుంది. అమెరికా ఎనర్జీ సెక్రటరీ క్రిస్ రైట్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల వల్ల చమురు ధరలు పెరగకుండా చూసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సౌత్ ఏషియా సముద్ర జలాల్లో ఉన్న రష్యా ఆయిల్‌ను భారత్ త్వరగా రిఫైన్ చేసి మార్కెట్‌లోకి తెస్తే, ప్రపంచంలోని ఇతర రిఫైనరీల మీద ఒత్తిడి తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది రష్యాపై అమెరికా విధానంలో శాశ్వత మార్పు కాదని, కేవలం యుద్ధం వల్ల ఏర్పడిన తాత్కాలిక అవసరాల కోసమేనని అధికారులు స్పష్టం చేశారు. గత నెలలో కుదిరిన వాణిజ్య ఒప్పందం ప్రకారం భారత్ రష్యా ఆయిల్ ఆపేసి అమెరికా ఆయిల్ కొనడానికి అంగీకరించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ స్వల్పకాలిక మినహాయింపు ఇచ్చారు.

## భారత్ లో రాజకీయ దుమారం

కేవలం ఒక్క పదం ఇప్పుడు భారత్‌లో రాజకీయ దుమారాన్ని రేపింది. రష్యా చమురు కొనుగోలు విషయంలో అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ చేసిన వ్యాఖ్యలపై విపక్షాలు భగ్గుమంటున్నాయి. సముద్రంలో నిలిచిపోయిన రష్యా చమురును కొనుగోలు చేసేందుకు భారత్‌కు 'పర్మిషన్' (అనుమతి) ఇచ్చామంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణించింది. ఇది దేశానికి అవమానకరమని, ప్రధాని నరేంద్ర మోదీ దౌత్యపరమైన బలహీనతకు నిదర్శనమని విమర్శించింది. భారత్ స్థానంపై కొత్త చర్చకు తెరలేపింది.

# అమెరికా దాడిలో ఇరాన్ యుద్ధనౌక మునిగిపోవడంపై జైశంకర్ స్పందన

**మిలన్-2026 విన్యాసాల్లో మూడు ఇరాన్ యుద్ధ నౌకలు పాల్గొన్నాయన్న జైశంకర్**
**మార్చి 1న ఇరాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు కొచ్చి పోర్టులో వాటికి డాకింగ్ అనుమతి ఇచ్చినట్టు వెల్లడి**
**మార్చి 4న శ్రీలంక సమీపంలో ఒక నౌకపై అమెరికా దాడి చేసిందన్న జైశంకర్**

ఢిల్లీలో జరుగుతున్న రైసినా డైలాగ్ 2026 వేదికగా భారత విదేశాంగ మంత్రి జైశంకర్ హిందూ మహాసముద్రంలో నెలకొన్న ఉద్రిక్తతలు, ఇరాన్ నౌకలకు భారత్ ఇచ్చిన అనుమతులపై కీలక వివరణ ఇచ్చారు. శ్రీలంక తీరంలో అమెరికా సబ్‌మెరైన్ దాడిలో ఇరాన్ యుద్ధనౌక మునిగిపోయిన కొన్ని రోజులకే ఈ వ్యాఖ్యలు రావడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

## జైశంకర్ వివరించిన ప్రధానాంశాలు



## ఇవే:

హిందూ మహాసముద్రంలో మూడు ఇరాన్ నౌకలు (ఐరిస్ దేనా, ఐరిస్ లావన్, ఐరిస్ బుషెహర్) ఫిబ్రవరిలో విశాఖపట్నంలో జరిగిన మిలాన్-2026 (మిలన్ 2026) విన్యాసాల్లో పాల్గొన్నాయి. అయితే, మార్చి మొదటి వారంలో అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య యుద్ధం ముదరడంతో ఈ నౌకలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. మార్చి 1న ఇరాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు, మానవీయ కోణంలో ఆలోచించి వాటికి కొచ్చి పోర్టులో డాకింగ్ అనుమతి ఇచ్చినట్లు జైశంకర్ తెలిపారు. ఆ నౌకల్లో యువ క్యాడెట్లు ఉన్నారని, వారు అనుకోని పరిస్థితుల్లో ఈ పరిణామాల మధ్య చిక్కుకున్నారని ఆయన పేర్కొన్నారు. శ్రీలంక తీరానికి సమీపంలో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ.. మార్చి 4న అంతర్జాతీయ జలాల్లో ఉన్న ఇరాన్ ఫ్రిగేట్ 'ఐరిస్ దేనా'పై అమెరికా సబ్‌మెరైన్ టార్పెడోతో దాడి చేయడంతో అది మునిగిపోయిందని గుర్తుచేశారు. భారత్ చట్టపరమైన అంశాల కంటే మానవత్వానికే పెద్దపీట వేసిందని, తాము తీసుకున్నది సరైన నిర్ణయమని జైశంకర్ స్పష్టం చేశారు. హిందూ మహాసముద్రంలో విదేశీ సైనిక స్థావరాల ఉనికి అనేది వాస్తవమని, ఈ నేపథ్యంలో భారత్ అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఆయన చెప్పారు.

# రేవంత్ రెడ్డికి అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ ఆహ్వానం

**రేవంత్ రెడ్డిని కలిసిన డెలావర్ గవర్నర్ మాట్ మేయర్**
**ప్రజాక్షేమం, పాలనా సంస్కరణలపై చర్చ**
**డెలావర్ రాష్ట్ర పర్యటనకు రావాలని రేవంత్ కు ఆహ్వానం**



అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ మాట్ మేయర్ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ముఖ్యంగా ఆరోగ్యం, విద్య మరియు సాంకేతిక రంగాలలో పరస్పర సహకారంపై కీలక చర్చలు జరిగాయి. వీరి భేటీలో ప్రజాక్షేమం, పాలనా సంస్కరణలే ప్రధాన ఎజెండాగా నిలిచాయి. డెలావర్ రాష్ట్రంలో తాము విజయవంతంగా అమలు చేసిన పేద, మధ్యతరగతి ప్రజల గృహ నిర్మాణ పథకాలు, రుణమాఫీ కార్యక్రమాల గురించి మాట్ మేయర్ ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యంగా అందరికీ నాణ్యమైన వైద్యం అందించే 'యూనివర్సల్ హెల్త్ కేర్' విధానంపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. సాంకేతిక యుగంలో అతి ముఖ్యమైన అంశాలైన సమాచార భద్రత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంలో పాటించాల్సిన నిబంధనలపై కూడా ఇరువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని, ఇక్కడి మౌలిక సదుపాయాలను అభినందించిన గవర్నర్ మాట్ మేయర్, భవిష్యత్తులో రెండు రాష్ట్రాల మధ్య ఆర్థిక మరియు సాంకేతిక బంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇదే క్రమంలో, తెలంగాణ నుండి ఒక అధికారిక ప్రతినిధుల బృందంతో కలిసి డెలావర్ రాష్ట్ర పర్యటనకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డెలావర్ ఫస్ట్ లేడీ లారెన్ మేయర్‌తో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొని, రెండు రాష్ట్రాల మధ్య కుదుర్చుకోబోయే భవిష్యత్ ఒప్పందాల గురించి ప్రాథమిక చర్చలు జరిపారు.

# దుబాయ్‌లో చవకగా బంగారం...

**దుబాయ్‌లో ఔన్సు బంగారంపై 30 డాలర్ల తగ్గింపు**
**యుద్ధం కారణంగా నిలిచిపోతున్న విమాన సర్వీసులు**
**భారీగా పెరిగిన రవాణా మరియు బీమా ఖర్చులు**
**భారత్‌లో సరిపడా నిల్వలు ఉన్నాయని నిపుణుల వెల్లడి**



సాధారణంగా పండుగలు లేదా ప్రత్యేక సందర్భాల్లో ఎలక్ట్రానిక్స్, వస్త్రాలపై ఆఫర్లు ఉండటం సహజం. కానీ, ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ యుద్ధ వాతావరణం కారణంగా దుబాయ్‌లో బంగారంపై అనూహ్యమైన డిస్కౌంట్లు లభిస్తున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధం, గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతల కారణంగా రవాణా వ్యవస్థ స్తంభించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర 5,147 డాలర్ల వద్ద ఉండగా, దుబాయ్‌లో మాత్రం దీనికంటే దాదాపు 30 డాలర్లు (సుమారు రూ.2,700కు పైగా) తక్కువకే విక్రయిస్తున్నారు. ప్రధానంగా బులియన్ వ్యాపారులు, సంస్థలకు ఈ తగ్గింపు వర్తిస్తోంది.

**రాయితీ వెనుక ఉన్న అసలు కారణాలు**

ప్రస్తుతం గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో విమాన సర్వీసులు అరకొరగా నడుస్తున్నాయి. సాధారణంగా ప్రయాణికుల విమానాల్లోని కార్గో విభాగంలో బంగారాన్ని సురక్షితంగా తరలిస్తుంటారు. అయితే, యుద్ధం కారణంగా యూఏఈ గగనతలం మీదుగా వెళ్లే విమానాలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. సౌదీ అరేబియా, ఒమన్ మార్గాల ద్వారా వెళ్లాల్సి వస్తున్నా, వ్యాపారులు ఆ మార్గాలపై ఆసక్తి చూపడం లేదుమరోవైపు, సరుకు రవాణాలో అనిశ్చితి నెలకొనడం, డెలివరీ ఖర్చులు మరియు బీమా ప్రీమియంలు విపరీతంగా పెరిగిపోవడంతో కొనుగోలుదారులు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో స్టాక్ తమ వద్దే ఉండిపోతే నష్టాలు వస్తాయన్న భయంతో, దుబాయ్ వ్యాపారులు అంతర్జాతీయ రేటు కంటే తక్కువకే బంగారాన్ని వదిలించుకోవడానికి మొగ్గుచూపుతున్నారు. శుక్రవారం నాటికి కూడా పెద్ద మొత్తంలో బంగారం నిల్వలు దుబాయ్‌లోనే ఉండిపోయినట్లు సమాచారం.

**భారత్‌పై ప్రభావం**

**అంతంతమాత్రమే**

దుబాయ్ నుంచి వచ్చే డెలివరీలు ఆలస్యం కావడం వల్ల భారత్‌కు స్వల్పకాలికంగా బంగారం సరఫరా తగ్గవచ్చు. అయితే, దేశీయ మార్కెట్‌లో ప్రస్తుతం పసిడికి గిరాకీ పెద్దగా లేకపోవడం, జనవరి నెలలోనే భారీగా బంగారం దిగుమతి జరగడం వల్ల మన దగ్గర సరిపడా నిల్వలు ఉన్నాయి. కాబట్టి ఆర్డర్లు పెట్టిన వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిపుణులు సూచిస్తున్నారు. భారత్‌లోని అతిపెద్ద రిఫైనరీ అయిన ఎంఎంటీసీ-పాంప్‌కు పశ్చిమాసియా గనుల నుంచి 10 శాతం బంగారం దిగుమతి అవుతుంది. అయితే, యుద్ధం మొదలైన తర్వాత ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకునేందుకు రవాణా ఖర్చులు 60-70 శాతం వరకు పెరిగినట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రపంచానికి మేలిమి బంగారం ఎగుమతి కేంద్రంగా ఉన్న యూఏఈ, ప్రస్తుత క్షిపణి దాడుల భయంతో గగనతల ఆంక్షలు ఎదుర్కొంటోంది. దీనివల్ల స్విట్జర్లాండ్, యూకే వంటి దేశాలకు వెళ్లే సరఫరాపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది.

## హోర్ముజ్ జలసంధిలో
# ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి..

**హోర్ముజ్ జలసంధిలో 'ప్రైమా' అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి**
**హెచ్చరికలు పట్టించుకోకపోవడంతో డ్రోన్‌తో విరుచుకుపడ్డ ఆర్మీ**
**శత్రు దేశాల నౌకలకు జలసంధిలో అనుమతి లేదన్న ఇరాన్**
**గత ఎనిమిది రోజులుగా జలసంధి తమ ఆధీనంలోనే ఉందన్న ఐఆర్‌జీసీ**
**జలసంధిని పూర్తిగా మూసివేయలేదని ఇరాన్ ప్రభుత్వం స్పష్టీకరణ**

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. శనివారం హోర్ముజ్ జలసంధి గుండా వెళుతున్న 'ప్రైమా' అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషన్ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) దాడి చేసింది. తమ హెచ్చరికలను బేఖాతరు చేసినందుకే ఈ నౌకపై దాడి చేశామని ఇరాన్ సైన్యం ప్రకటించింది. షిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం.. భద్రతా కారణాల దృష్ట్యా హోర్ముజ్ జలసంధిలో రాకపోకలను నిషేధిస్తూ ఇరాన్ నేవీ హెచ్చరికలు జారీ చేసింది. అయితే 'ప్రైమా' ట్యాంకర్ ఈ నిబంధనలను ఉల్లంఘించి ముందుకు సాగడంతో, ఐఆర్‌జీసీ డ్రోన్ ద్వారా ఆ నౌకపై దాడి చేసింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణించిన తర్వాత, గత ఎనిమిది రోజులుగా హోర్ముజ్ జలసంధి తమ పూర్తి నియంత్రణలో ఉందని ఐఆర్‌జీసీ తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్ వంటి శత్రు దేశాలకు చెందిన లేదా వాటికి మద్దతు తెలిపే వాణిజ్య నౌకలను ఈ మార్గంలో అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అయితే, హోర్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేసినట్లు వస్తున్న వార్తలను ఇరాన్ ప్రభుత్వం ఖండించింది. అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే నౌకల రాకపోకలు జరుగుతున్నాయని, జలసంధిని పూర్తిగా మూసివేసే ఆలోచన ప్రస్తుతానికి లేదని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్‌జాదే తెలిపారు. కానీ, యుద్ధ సమయంలో జలసంధిని నియంత్రించే హక్కు తమకు ఉందని, అమెరికా, ఇజ్రాయెల్ నౌకలు లేదా మారువేషంలో వచ్చే యుద్ధ నౌకలను మాత్రం సైనిక లక్ష్యాలుగా పరిగణించి అడ్డుకుంటామని ఇరాన్ సైన్యం హెచ్చరించింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ ప్రతీకార దాడులు తీవ్రతరం చేయడంతో ఈ ప్రాంతంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.



# మహిళా రైతులకు సమాన హక్కులు, సమ న్యాయం



మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాన హక్కులు, సమ న్యాయం అందించాలని, వాటిని అనుభవించే పరిస్థితులు కల్పించాలని ప్రపంచ వ్యాప్తంగా మహిళలు, యువతులు డిమాండ్ చేస్తున్నారు. అందునా ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా పరిగణిస్తున్నారు.

కుటుంబంలో ఆడపిల్లలకు వారసత్వ ఆస్తి హక్కు సహా చట్టపరంగా కల్పించిన అనేక హక్కులు క్షేత్ర స్థాయిలో ఇంకా పూర్తిగా అమలుకు నోచుకోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు, భూములు ఈనాటికీ అధికారికంగా ఇంట్లో మగవాళ్ల పేరిట రిజిష్టరయి ఉన్నాయి. సామాజిక కట్టుబాట్లు, పురుషాధిపత్య వారసత్వ భావనలు, అధికార యంత్రాంగం కల్పించే ఆటంకాలతో పాటుగా చట్టపరంగా సంక్రమించిన హక్కుల పట్ల మహిళలలో కనీస అవగాహన లోపించడం మూలంగా భూమి దస్తావేజులలో మహిళలకు స్థానం దక్కడం లేదు. భూమికి యజమానురాలు కానప్పటికీ వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువుల కొనుగోళ్ల నుంచి కూలీలను పెట్టుకోవడం వరకూ మహిళలే దగ్గరుండి చూసుకుంటున్నారు.

భూమి పట్టా మహిళా రైతుల పేరున లేకపోవడం మూలంగా అసలు ఆమె రైతు గుర్తింపునకే నోచుకోవడం లేదు. ఈ కారణంగానే సంస్థాగత రుణాలు, పంటల బీమా, నీటి పారుదల పథకాలు, ఇతర వ్యవసాయ అనుబంధ సేవలు, పర్యావరణహిత సాంకేతిక సదుపాయాలు ఇవేమీ మహిళా రైతులకు అందుబాటులోకి రావడం లేదు. ఈ పథకాలు, సేవలు అన్నింటికీ భూమి మీద యజమాన్య హక్కు కలిగి ఉండడం కనీస అర్హతగా మారడంతో మహిళా రైతులను పథకం ప్రకారమే వెలివేసినట్లయ్యింది.

వ్యవసాయ భూముల మీద మహిళలకు హక్కు, నియంత్రణలు కల్పించడానికి సామాజిక పరమైన, సాంస్కృతికపరమైన, న్యాయ పరమైన ఆటంకాలు ఎదురవుతున్నాయి. వ్యవసాయానికి మహిళలు ఇచ్చే తోడ్పాటుకు, వాళ్ల పడే శ్రమకు గుర్తింపే లేకుండా పోయింది. ఆహార వ్యవసాయ ఉత్పత్తులను పండించడంలో మహిళలు పడుతున్న శ్రమకి తగిన గుర్తింపు లభించడంలేదు. దీంతో మహిళలను 'రైతు'గా కూడా పరిగణించడం లేదు. వ్యవస్థాగతంగా మహిళలను వెలివెయ్యడానికి సంస్థాగతంగా ఉన్న ఈ వివక్షను, అన్యాయాన్ని సరిదిద్దాలి.

**మహిళా వ్యవసాయానికి రక్షణ కరువు**

పనుల కోసం ఇంట్లో మగవాళ్లు వలసలు పోవడం నానాటికీ పెరుగుతున్నది. ఈ కారణంగా ఇంటిల్లిపాదికి తిండి సమకూర్చటం కోసం కష్టనష్టాలన్నీ భరిస్తూ మహిళలు వ్యవసాయం చేపట్టాల్సి రావడమనేది మరింతగా పెరుగుతోంది. వ్యవసాయంలో మహిళల పాత్ర విస్తరిస్తుండడం మూలంగా వాళ్లలో పౌష్టికాహార లోపాన్ని అధిగమించే అవకాశాలు పెరిగాయని సూత్రీకరిస్తున్నాను. కానీ క్షేత్ర స్థాయిలో ఇందుకు భిన్నమైన పరిణామాలు కనబడుతున్నాయి. వ్యవసాయ పనుల భారం, మొరటు శారీరక శ్రమ తగ్గించే సాంకేతిక సాధనాలు అందుబాటులో లేకపోవడం మహిళల ఉత్పత్తి, పునరుత్పత్తి సామర్థ్యాల మీద అలవిగాని ఒత్తిడి తెచ్చిపెడుతున్నాయి. సీజన్‌లో వ్యవసాయ పనులు పూర్తి చెయ్యడానికి తగినన్ని వనరులు లేని పేద మహిళా రైతులు పనుల భారం మూలంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని వివిధ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మన దేశంలో మహిళలు, ఆడపిల్లల్లో పౌష్టికాహార లోపం మాత్రం ఆమోద యోగ్యం కానంత పెచ్చు స్థాయిలో నెలకొని ఉన్నది. యుక్త వయసు వచ్చిన పిల్లల్లో మాంసకృత్తుల లోపంతో పాటు రక్తహీనత కూడా అత్యధికంగా ఉండడం నిశ్శబ్ద అత్యయిక పరిస్థితికి అద్దం పడుతున్నది. మహిళలలో నెలకొని ఉన్న పౌష్టికాహార లోపం కొన్ని తరాల పాటు ప్రభావం చూపిస్తుంది. మాతృమూర్తిలో పౌష్టికాహార లోపం, రక్తహీనతల మూలంగా పుట్టే బిడ్డ బరువు తక్కువగా ఉండడం, ఆరోగ్యకరమైన ఎదుగుదల లేకపోవడం ఎదిగే వయసులో ఉన్న పిల్లల పాలిట శాపంగా పరిణమిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో అనేక కుటుంబాలలో చిరుధాన్యాల ఆహారమే తప్ప... తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు మాంసకృత్తుల లభ్యత చాలా అరుదుగా ఉంటుంది. మహిళలకు, వారి బిడ్డలకు పోషకాహారం లభించడం లేదు. గత పదేళ్లుగా మన దేశంలో జాతీయ ఆహార భద్రతా చట్టం కింద పనికి ఆహార పథకం అమలవుతూ వస్తుంది. చౌకధరలకు తృణధాన్యాలు అందించడం, గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు, యుక్త వయసులో ఉన్న ఆడ పిల్లలకు పోషకాహారాన్ని అందించాలని చట్టం చెబుతుంది. కొన్ని రాష్ట్రాలు పప్పుధాన్యాలు అందిస్తున్నాయి. అయినప్పటికీ మహిళలలో రక్తహీనత, పోషకాహార లోపం ఆందోళనకర స్థాయిలో కొనసాగుతూనే ఉన్నది.

## ఇరాన్‌తో యుద్ధం... సురక్షితంగా స్నానం చేయడానికి 'కెన్ ఐ షవర్'ను ఉపయోగిస్తున్న ఇజ్రాయెలీలు


**ఇరాన్‌తో ఎనిమిదో రోజుకు చేరిన ఇజ్రాయెల్ యుద్ధం**
**ఇజ్రాయెలీల దైనందిన జీవితంపై ప్రభావం**
**కెన్ ఐ షవర్ యాప్ ద్వారా అలర్ట్స్ తెలుసుకుంటున్న ప్రజలు**



ఇరాన్‌తో యుద్ధం వేళ, ఏ సమయంలో ఎక్కడ ఏ క్షిపణి పడుతుందో, ఏ బాంబు పడుతుందో తెలియని పరిస్థితి ఉంది. దీనితో ఇజ్రాయెల్ ప్రజల దైనందిన జీవితానికి అంతరాయం ఏర్పడుతోంది. ఈ క్రమంలో ఆ దేశ ప్రజలు 'కెన్ ఐ షవర్' అనే యాప్ లేదా వెబ్‌సైట్‌ను ఉపయోగిస్తున్నారు. గత ఎనిమిది రోజులుగా అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం సాగుతోంది. దీంతో నిత్యం ఎయిర్ సైరన్ల మోత వినిపిస్తోంది. యుద్ధ భయంతో చాలామంది స్నానం చేయడానికి కూడా భయపడుతున్నారు. ఇలాంటి సమయంలో 'కెన్ ఐ షవర్'ను ఉపయోగించి ఏ సమయంలో స్నానం చేయడం సురక్షితమో తెలుసుకుంటున్నారు. క్షిపణుల ప్రమాదం ఉన్నసమయంలో స్థానిక యంత్రాంగం ప్రజలకు అలర్ట్స్ ఇస్తోంది. దానితో పాటు సైరన్లు మోగుతుంటాయి. ఆ సమయంలో బాంబు షెల్టర్లు లేదా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవడానికి 30 సెకన్ల నుంచి 90 సెకన్లకు మించి సమయం ఉండదని చెబుతున్నారు. ఇలాంటి సమయంలో స్నానం చేస్తూ ఉంటే అలర్ట్స్ వినపడటం, పరుగెత్తడం కష్టమవుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని 'కెన్ ఐ షవర్'ను ఉపయోగిస్తున్నారు. ఇది అధికారిక భద్రతా వ్యవస్థ కాకపోయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో సహాయకారిగా ఉంటోంది. అయితే దీనిపై పూర్తిగా ఆధారపడలేమని ఇజ్రాయెల్ ప్రజలు చెబుతున్నారు. రాకెట్ అటాక్ ప్యాటర్న్, అలర్ట్ డేటాను పరిశీలించి ఈ యాప్ అవుట్‌పుట్ ఇస్తుంది.

# మమతా బెనర్జీ, బెంగాల్ ప్రభుత్వం తీరుపై ద్రౌపది ముర్ము అసహనం

**బెంగాల్ పర్యటనలో ప్రోటోకాల్ వైఫల్యం**
**సీఎం లేదా మంత్రుల నుంచి అధికారిక స్వాగతం అందలేదన్న రాష్ట్రపతి**
**మమతా బెనర్జీపై తనకు ఎలాంటి ద్వేషం లేదన్న రాష్ట్రపతి**
**మమత తనకు సోదరి లాంటి వారన్న రాష్ట్రపతి**



పశ్చిమ బెంగాల్ పర్యటనలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ వైఫల్యం కనిపించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వలేదని, అలాగే రాష్ట్ర పర్యటనకు వచ్చిన తనకు ముఖ్యమంత్రి లేదా మంత్రుల నుంచి అధికారిక స్వాగతం లభించలేదని పేర్కొన్నారు. ఆదివాసీ సదస్సుకు తాను ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉందని తెలిపారు. దీనికి ప్రభుత్వం అనుమతించకపోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఇంత చేసినప్పటికీ తనకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై ఎలాంటి ద్వేషం లేదని, ఆమె తన సోదరితో సమానమని అన్నారు. కానీ ఆమె కోపంగా ఉండవచ్చని వ్యాఖ్యానించారు. బెంగాల్ గవర్నర్ ట్రాన్స్‌ఫర్ అయినందున స్వాగతం పలకలేకపోయారని తనకు తెలుసని అన్నారు. తాను కూడా బెంగాల్ బిడ్డనే అని అన్నారు. 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో ప్రసంగించడానికి రాష్ట్రపతి బెంగాల్‌లోని సిలిగురికి వెళ్లారు. ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్రానికి వచ్చిన రాష్ట్రపతికి ముఖ్యమంత్రి లేదా ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు స్వాగతం పలకాలి. కానీ అధికారికంగా స్వాగతం పలకడానికి ప్రభుత్వం తరఫున ఎవరూ రాలేదు. అంతర్జాతీయ సంతాల్ సదస్సును బిధాన్ నగర్‌లో నిర్వహించాల్సి ఉండగా, అధికారులు సిలిగురిలోని గోసాయిన్?పూర్‌కు మార్చారని ద్రౌపది ముర్ము తెలిపారు. సంతాల్ సదస్సుకు పెద్ద ఎత్తున సంతాల్ ఆదివాసీలు తరలి వస్తుండటం తాను చూశానని, కానీ వారిని కొంతమంది అడ్డుకున్నారని ఆరోపించారు. సంతాల్ జాతీయులు ఏకంకావడం, చదువుకోవడం, బలోపేతం కావడం వారికి ఇష్టం లేనట్లుగా ఉందని అన్నారు.

## అమెరికా– ఒత్తిళ్లకు
# తలవంచబోం




**ఇరాన్ లొంగిపోవాలనే శత్రువుల కల నెరవేరదు**
**అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఇరాన్ అధ్యక్షుడు కౌంటర్**
**మా దేశాన్ని కాపాడుకుంటాం: పెజెష్కియాన్**
**పొరుగుదేశాలపై దాడులకు క్షమాపణ**

అమెరికా– ఒత్తిళ్లకు తలవంచే ప్రసక్తే లేదని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ శనివారం స్పష్టంచేశారు. ఇరాన్ ప్రజలు ఎన్నడూ లొంగిపోరని, ఇరాన్‌ను లొంగదీసుకోవచ్చని అనుకునే వాళ్లు ఎప్పటికీ విజయం సాధించాలేరని, ఎట్టిపరిస్థితుల్లో తమ దేశాన్ని తామే కాపాడుకుంటామని ఇరాన్ స్టేట్ టీవీ ప్రసారం చేసిన ప్రసంగంలో పెజెష్కియాన్ చెప్పారు. పొరుగుదేశాలపై తమ దాడు లపై ఆయన క్షమాపణ చెప్పారు.‘ఇరాన్ జరిపిన దాడులకు పొరుగు దేశాలకు వ్యక్తిగతంగా, ఇరాన్ తరఫున క్షమాపణలు తెలియజేసుకుంటున్నాను’ అని ఆయన పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇరాన్ లొంగిపోవాలని చేసి న వ్యాఖ్యలపై పెజెష్కియాన్ పరోక్షంగా స్పందిస్తూ.. ఇరాన్ ప్రజలు లొంగిపోవాలనే శత్రువుల కోరికలు వారు చచ్చి, స్మశానికి వెళ్లినా నెరవేరవని ఇరాన్ అధ్యక్షుడు అన్నారు. ఇరాన్ తన పొరుగు దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తుందని, ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ మధ్య ప్రాచ్యంలో మళ్లీ ప్రశాంత పరిస్థితులకు ఇరాన్ కృషి చేస్తున్నదని తెలిపారు. అమెరికా దళాలున్న కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లను ఇరాన్ లక్ష్యంగా చేసుకున్న విషయం తెలిసిందే. కాగా, పొరుగుదేశాలలో దాడి చేయమని ఇరాన్ అధ్యక్షుడు ప్రకటించినప్పటికీ గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. దుబాయ్, అబుదాబి వంటి ప్రధాన నగరాల్లో పేలుళ్లు వినిపిస్తున్నాయి. క్షిపణులు, డ్రోన్లను ఎయిర్ డిఫెన్స్ సిస్టంలు అడ్డుకుంటున్న శబ్దాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారు జామున ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. విమానాశ్రయం సమీపంలో పెద్ద శబ్దం వినిపించడంతో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆపరేషన్లను శనివారం నిలిపివేశారు. ఇది చిన్న ఘటనేనని, అయితే ప్రయాణికుల భద్రత రీత్యా విమాన సర్వీసులను రద్దు చేశామని అధికారులు తెలిపారు. అమెరికా ఇరాన్ దాడుల వల్ల గల్ఫ్ వ్యాప్తంగా ఎయిర్ ట్రావెల్‌కు అంతరాయం కలగడంతో వేలాది విమానాలు రద్దవుతున్నాయి. క్షిపణులు, డ్రోన్ దాడుల భయంలో పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి. అమెరికా, ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడులతో తాము 1,332 పౌరులను కోల్పోయామని శనివారం ఇరాన్ ప్రకటించింది.

## ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో శనివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గకు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు సిట్ అధికారులు ఈ కేసులో దర్యాప్తును లోతుగా పరిశీలించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గను ఈ కేసులో రెండవ నిందితురాలిగా (ఏ–2) చేర్చారు. ఈ మేరకు సిట్ అధికారులు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టులో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేశారు. పోలీసులు సమర్పించిన ఛార్జిషీట్‌ను, సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. లక్ష్మీ దుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టు ఆదేశాలు వెలువడిన వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు.

## కొత్తగా ఆలోచించే వారి కోసం
# ‘క్రియేటివ్ సిటీ’: సీఎం చంద్రబాబు ప్రకటన

**ఢిల్లీలో రైసినా డైలాగ్-2026 సదస్సు**
**ఈ సదస్సుకు హాజరైన తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఘనత**
**త్వరలో అమరావతి వేదికగా గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటు**
**సాంకేతికతతో భారత్‌కు రివర్స్ మైగ్రేషన్ తప్పదని సీఎం వెల్లడి**
**దక్షిణాదిలో తగ్గుతున్న జననాల రేటును పెంచేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు**



“విభిన్నంగా ఆలోచించే వారి కోసం, సృజనాత్మకతకు పెద్దపీట వేసే మేధావుల కోసం అమరావతిలో అత్యాధునికమైన ‘క్రియేటివ్ సిటీ’ని నిర్మిస్తున్నాం. కేవలం పరిపాలనా నగరంగా మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం” అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక ‘రైసినా డైలాగ్–2026’ సదస్సులో పాల్గొన్న ఆయన, తన ప్రసంగంలో అమరావతి అభివృద్ధికి సంబంధించి కీలక విషయాలను ప్రపంచ దేశాల ప్రతినిధులతో పంచుకున్నారు. అమరావతిలో కేవలం భవనాలు మాత్రమే ఉండవని, అక్కడ డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ సిటీ వంటి భవిష్యత్ ఆధారిత రంగాలు కొలువుదీరుతాయని స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతిలో ‘గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్’ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో ‘సాంకేతికత – సుపరిపాలన – భవిష్యత్తు’ అనే అంశంపై చంద్రబాబు ప్రసంగించారు. 2016 నుంచి జరుగుతున్న ఈ సదస్సుకు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ అరుదైన గౌరవం దక్కించుకున్న చంద్రబాబు, ఏపీని ‘ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ డెస్టినేషన్’గా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఏఐ డేటా సెంటర్లతో పాటు, ఆరోగ్య రంగంలో డ్రోన్ అంబులెన్సులు వంటి విప్లవాత్మక మార్పులు ఏపీలో ఇప్పటికే రియాలిటీలోకి వచ్చాయని గుర్తుచేశారు. పెట్టుబడుల కోసం వచ్చే పారిశ్రామికవేత్తలకు ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు ఇస్తూ, ఏపీని వ్యాపార అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దామని వివరించారు.

**అవకాశాల గనిగా భారత్**

ప్రపంచవ్యాప్తంగా భారతీయులు కీలక స్థానాల్లో ఉన్నారని, అనేక దేశాల అభివృద్ధిలో మనవారి పాత్ర మరువలేనిదని సీఎం కొనియాడారు. టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్ వంటి రంగాలను వేగంగా అందిపుచ్చుకోవడం వల్లే భారత్ అగ్రగామిగా ఎదుగుతోందన్నారు. ఒకప్పుడు సిలికాన్ వ్యాలీ వంటి ప్రాంతాలకు భారత్ నుంచి మేధో వలస జరిగిందని, కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోందని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం, వనరులు ఉన్నచోటికే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని, త్వరలోనే భారత్‌కు ‘రివర్స్ మైగ్రేషన్’ మొదలవుతుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో 60 శాతం భారత్‌లోనే ఉండటం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భారత్ దూసుకుపోతోందని, భవిష్యత్తులో ఇతర దేశాలకు విద్యుత్ ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

**జనాభా నిర్వహణపై డేంజర్ బెల్స్**

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు వృద్ధుల జనాభా పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి ఏపీలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చంద్రబాబు వివరించారు. ఒకప్పుడు ప్రజాప్రతినిధిగా కుటుంబ నియంత్రణ గురించి ప్రచారం చేసిన తాను, నేడు ‘పాపులేషన్ మేనేజ్‌మెంట్’ (జనాభా నిర్వహణ) ఆవశ్యకత గురించి మాట్లాడుతున్నానని తెలిపారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఫెర్టిలిటీ రేటు 1.5కి పడిపోయిందని, దీనిని కనీసం 2.1కి తీసుకురావడమే లక్ష్యంగా కొత్త పాలసీని తీసుకొచ్చామని చెప్పారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలంతా జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, మూడో బిడ్డ పుడితే రూ.25 వేల ఆర్థిక సాయంతో పాటు, నెలకు రూ.1000 అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అలాగే చైల్డ్ కేర్ లీవ్ వంటి సౌకర్యాలపై కూడా ఆలోచన చేస్తున్నామన్నారు. గతంలో దేశానికి ఆస్తిగా ఉన్న పెద్ద కుటుంబాలు ఇప్పుడు మైక్రో ఫ్యామిలీలుగా మారిపోయాయని, ఈ విషయంలో ప్రజల ఆలోచనా దృక్పథాన్ని మార్చాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.

## కామారెడ్డిలో కలకలం రేపుతున్న చిన్నారుల అదృశ్యం

**రెండు రోజుల్లో ఐదుగురు చిన్నారులు అదృశ్యం**
**నిన్న ఇద్దరు, ఈరోజు ముగ్గురుఅక్కాచెల్లెల్లు మిస్సింగ్**
**సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

తెలంగాణలోని కామారెడ్డిలో రెండు రోజుల్లో ఐదుగురు చిన్నారులు అదృశ్యం కావడం కలకలం రేపుతోంది. అదృశ్యమైన వారంతా పదేళ్ల లోపు చిన్నారులే. శుక్రవారం ఇద్దరు, ఈరోజు మరో ముగ్గురు చిన్నారులు అదృశ్యమయ్యారు. ఐదుగురు పిల్లలు కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వారంతా కామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. నిన్న పట్టణంలోని గోసంగి కాలనీకి చెందిన పదేళ్ల సింహాద్రి, తొమ్మిదేళ్ల విజయ్ కనిపించకుండా పోయారు. ఈరోజు ఆర్బీ నగర్ కాలనీకి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు సీపాత్ (8), ఆయాత్ (7), మరియం (5) అదృశ్యమయ్యారు. ఈ ముగ్గురు పిల్లలు




తండ్రి ఆటోలో దుకాణానికి వెళ్లారు. తండ్రి వారిని దుకాణం వద్ద దింపి కిరాయికి వెళ్లాడు. కానీ ముగ్గురు ఆ తర్వాత కనిపించలేదు.

## జగన్ మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది: లోకేశ్

**ప్రజలను వంచించడానికే ఆ హామీ అన్న లోకేశ్**
**ప్రతి నెల రూ. 100 కోట్ల ముడుపులు అందాయని ట్వీట్**
**రూ. 3,500 కోట్ల లాండరింగ్ జరిగిందన్న లోకేశ్**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన ‘మద్య నిషేధం’ హామీ వెనుక అసలు కథ వేరే ఉందని, ఆ హామీ కేవలం ప్రజలను వంచించడానికేనని లోకేశ్ ఆరోపించారు. ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకుని, గత ఐదేళ్లలో జరిగిన అవినీతి చిట్టాను ఆయన బయటపెట్టారు. ఈ మేరకు జాతీయ మీడియాలో వచ్చిన కథనాల క్లిప్పింగ్ లను కూడా లోకేశ్ తన ట్వీట్ లో పంచుకున్నారు. మద్యం వ్యాపారం ద్వారా



ప్రతి నెలా సుమారు వంద కోట్ల రూపాయల మేర ముడుపులు అందాయని, మొత్తంగా 3,500 కోట్ల రూపాయల మేర మనీ లాండరింగ్ జరిగిందని లోకేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పటికే 1,048 కోట్ల రూపాయల నగదు లావాదేవీల జాడను వెలికితీసిందని గుర్తుచేశారు. ఒకవైపు ముఖ్యమంత్రి హోదాలో జగన్ మద్య నిషేధం గురించి ప్రసంగాలు చేస్తుంటే, మరోవైపు ఆయన అనుచరులు అక్రమ మద్యం ద్వారా వేల కోట్లు గడించారని మండిపడ్డారు. ఈ క్రమంలో వేలాది పేద కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రజలకు ఈ దోపిడీపై సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండిపోతారా? అంటూ జగన్‌కు లోకేశ్ సూటి ప్రశ్న సంధించారు.

# ఇరాన్ ఉద్రికత్తలు..

**పెట్రోల్ డీజిల్ ధరలు పెరగవని స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వ వర్గాలు**
**దేశంలో మెరుగుపడిన ఇంధన నిల్వలు మరియు సరఫరా వ్యవస్థ**
**విపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదని ఖండన**
**వంటగ్యాస్ మినహా మిగిలిన ఇంధన ధరలు స్థిరమేనని వెల్లడి**
**హార్ముజ్ జలసంధిపై తగ్గిన ఆధారపడటం**

వాహనదారులకు ఊరటనిచ్చే వార్త ఇది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు శనివారం స్పష్టం చేశాయి. ప్రస్తుతం భారత్‌లో ఇంధన నిల్వలు మెరుగుపడుతున్నాయని, పరిస్థితి మరింత స్థిరంగా మారుతోందని, అందువల్ల ధరల పెంపు ఉండదని వెల్లడించాయి. ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉందంటూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. ఆ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేశాయి. అయితే, ధరలు పెరగవన్న హామీ కేవలం పెట్రోల్, డీజిల్ విషయంలోనేనని, ఎల్‌పీజీ (వంటగ్యాస్) విషయంలో కాదని స్పష్టత ఇచ్చారు. గడిచిన 12 ఏళ్లలో ఎల్‌పీజీ సిలిండర్ ధర సుమారు రూ.110 మేర పెరిగిందని అధికారులు గుర్తుచేశారు. ప్రస్తుతం ఎల్‌పీజీ ఉత్పత్తికి ప్రాధాన్యతనిస్తూ, సరఫరా మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మరోవైపు, ముడి చమురు దిగుమతుల కోసం సమస్యాత్మక మార్గాలపై ఆధారపడటాన్ని భారత్



తగ్గించుకుంది. హార్ముజ్ జలసంధి కాకుండా ఇతర మార్గాల ద్వారా చమురు దిగుమతులను పెంచుకున్నట్లు అధికారులు తెలిపారు. “గతంలో 60 శాతం ముడి చమురు దిగుమతులు ఇతర మార్గాల ద్వారా వచ్చేవని, ఇప్పుడు ఆ వాటా 70 శాతానికి పెరిగింది” అని వివరించారు. హార్ముజ్ జలసంధి ద్వారా కూడా మొదటి కార్గో రవాణా ప్రారంభమైందని, సరఫరా వ్యవస్థ గాడిలో పడుతోందని పేర్కొన్నారు. ఇంధన సరఫరా, ధరల స్థిరత్వాన్ని కాపాడేందుకు ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని తెలిపారు.




# ‘స్పిరిట్’ నుంచి మరో స్టార్ ఔట్..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘స్పిరిట్’ ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలను సృష్టించింది. కల్ట్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న సందీప్ రెడ్డి వంగా ఈ సినిమాను రూపొందిస్తుండగా, ‘యానిమల్’ సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమవ్వగా, 2027లో విడుదలయ్యే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే విడుదలైన వాయిస్ టీజర్, ప్రభాస్ ఫస్ట్ లుక్‌కు భారీ స్పందన రావడంతో ఈ ప్రాజెక్ట్‌పై హైప్
మరింత పెరిగింది. టీజర్ విడుదలైనప్పటి నుంచి ‘స్పిరిట్’ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్డేట్ కూడా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతోంది. ఈ క్రమంలో తాజాగా మరో క్రేజీ న్యూస్ చర్చనీయాంశంగా మారింది.

ఈ చిత్రంలో ప్రముఖ సీనియర్ నటుడు ప్రకాష్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నారని ముందుగా వార్తలు వచ్చాయి. అంతేకాదు వాయిస్ టీజర్‌లో కూడా ఆయన వాయిస్ వినిపించడంతో సినిమాలో ఆయన పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావించారు. అయితే ఇప్పుడు అనూహ్యంగా ‘స్పిరిట్’ ప్రాజెక్ట్ నుంచి ప్రకాష్ రాజ్ తప్పుకున్నారనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ విషయం పై అధికారిక ప్రకటన ఏదీ రాకపోయినా, సోషల్ మీడియా మరియు జాతీయ స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ వేదికల్లో ఈ వార్త విస్తృతంగా ప్రచారం పొందుతోంది.

ఆయన ఎందుకు తప్పుకున్నారనే విషయంపై స్పష్టత లేకపోవడంతో ఆసక్తి మరింత పెరిగింది. గతంలో ఈ సినిమా నుంచి హీరోయిన్ దీపికా పదుకొనే తప్పుకున్నారనే వార్తలు కూడా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ప్రకాష్ రాజ్ గురించిన ప్రచారం బయటకు రావడంతో మళ్లీ అదే తరహాచర్చ మొదలైంది. అయితే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ వార్తల నిజానిజాలు తెలియవు. భారీ అంచనాలతో రూపొందుతున్న ‘స్పిరిట్’ సినిమాలో నటీనటుల మార్పులు జరుగుతాయా లేదా అన్నది తెలుసుకోవాలంటే అభిమానులు ఇంకొంత కాలం వేచి చూడాల్సిందే.


# ఐశ్వర్య రాయ్ తొలి సంపాదన ఎంతో తెలుసా?



భారతీయ చలనచిత్ర రంగాన్ని ఓ ఊపు ఊపిన హీరోయిన్లలో ఐశ్వర్య రాయ్ ఒకరు. ఎన్నో ఏళ్ల పాటు ఆమె బాలీవుడ్ లో అగ్ర తారగా కొనసాగారు. ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. తన జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన ఐశ్వర్య ప్రయాణం మాత్రం చాలా సాధారణంగా మొదలయింది. ఓ ఇంటర్వ్యూలో నిర్మాత శైలేంద్ర సింగ్ మాట్లాడుతూ ఐశ్వర్య కెరీర్ తొలి రోజుల గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. అప్పటికి ఐశ్వర్య వయసు 18 లేదా 19 ఉంటుందని... తన తల్లిదండ్రులతో కలిసి మెరైన్ డ్రైవ్ లో తమను కలవడానికి రాత్రి 8.30 గంటల సమయంలో వచ్చిందని ఆయన తెలిపారు. తమ మొదటి మూడు ప్రకటనలను ఆమె కేవలం రూ. 5 వేల రూపాయలకే చేసిందని చెప్పారు.ఐశ్వర్య తొలి యాడ్ ను ముకేశ్ మిల్స్ లో చిత్రీకరించారని, కలబంద హెయిర్ ఆయిల్ కు ఐశ్వర్య మరో యాడ్ చేసిందని, అర్జున్ రాంపాల్ తో కలిసి మరో యాడ్ లో నటించిందని శైలేంద్ర సింగ్ తెలిపారు. ఐశ్వర్య ఎంతో వినయంగా ఉండేదని... అదే ఆమె కెరీర్ కు అద్భుతమైన పునాది వేసిందని చెప్పారు. 1994లో మిస్ వరల్డ్ టైటిల్ గెలుచుకున్న ఐశ్వర్య... అంతర్జాతీయంగా గుర్తింపును తెచ్చుకుంది. ఆ తర్వాత బాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఆమె... వెనుదిరిగి చూసుకోలేదు. అందంతో పాటు, మంచి నటనతో తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగారు. ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన ఐశ్వర్య... ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు.

## క్రేజీ సీక్వెల్ ‘ఆవేశం 2’ వచ్చేస్తుంది..

# పుష్ప యాక్టర్ ఫహద్ ఫాసిల్ ఏం చెప్పాడంటే..?



తెలుగు ప్రేక్షకుల్లో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న మాలీవుడ్ స్టార్ హీరోల్లో టాప్‌లో ఉంటాడు ఫహద్ ఫాసిల్. ఈ క్రేజీ యాక్టర్ నటించిన మాలీవుడ్ యాక్షన్ కామెడీ డ్రామా ఆవేశం.రోమాంచం ఫేం జీతూ మాధవన్ డైరెక్ట్ చేశాడు. సుమారు రూ.30 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. ఈ చిత్రంలో ఫహద్ ఫాసిల్ పోషించిన రంగ పాత్రకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.కాగా ఈ క్రేజీ చిత్రానికి సీక్వెల్ రాబోతుందన్న వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. తాజాగా ఓ ఈవెంట్‌లో సీక్వెల్‌పై క్లారిటీ ఇచ్చాడు ఫహద్ ఫాసిల్. ఆవేశం 2 ఉంటుందని అధికారికంగా ప్రకటించాడు. సీక్వెల్ 2027 లేదా 2028లో మొదలు కానుందని కూడా క్లారిటీ ఇచ్చాడు. డైరెక్టర్ జీతూ మాధవన్ సూర్యతో చేస్తున్న తన తొలి తమిళ చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ మూవీతోపాటు ఫహద్ ఫాసిల్ కమిట్ మెంట్స్ పూర్తయిన తర్వాత ఆవేశం 2 సెట్స్‌పైకి వెళ్లనుందట. మొత్తానికి పుష్ప యాక్టర్ అభిమానులు, మూవీ లవర్స్‌కు ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి.ఓ వైపు ఫహద్ ఫాసిల్ అండ్ టీం కామిక్ టైమింగ్.. మరో యాక్షన్ ఎలిమెంట్స్‌తో సాగే ఆవేశం చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న ఆవేశం 2 అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఆవేశం చిత్రాన్ని ఫహద్ ఫాసిల్–నజ్రియా నజీమ్, అనవ్ర్ రషీద్ సంయుక్తంగా నిర్మించారు.

# హీరోగా మారిన తమిళ స్టార్ దర్శకుడు..





దర్శకుడి నుంచి హీరోగా మారడం ఇండస్ట్రీలో కొత్తేమీ కాకపోయినా, ఒక సెన్సేషనల్ డైరెక్టర్ హీరోగా ఎంట్రీ ఇస్తుంటే ఆ అంచనాలే వేరుగా ఉంటాయి. ‘టూరిస్ట్ ఫ్యామిలీ’ చిత్రంతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అభిషన్ జీవింత్, ఇప్పుడు ‘విత్ లవ్’ సినిమాతో కథానాయకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. మదన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ క్యూట్ లవ్ స్టోరీలో అభిషన్ జీవింత్ హీరోగా నటిస్తుండగా, మలయాళీ ముద్దుగుమ్మ అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమాను సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 06న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన ప్రేమకథ గా కనిపిస్తోంది.ట్రైలర్‌లో విజువల్స్‌మరియు మ్యూజిక్‌ఒక ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగిస్తున్నాయి. ముఖ్యంగా యూత్ కనెక్ట్ అయ్యే ఎమోషన్స్ సినిమాలో పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సీన్ రోల్డాన్ సంగీతం అందిస్తుండగా, శ్రేయాస్ కృష్ణ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. కావ్య అనిల్, సచిన్ నాచిప్పన్, తేని మురుగన్, శరవణన్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# వాళ్లిద్దరికీ మాత్రం సిస్టర్ గా నటించలేను



సీనియర్ నటి సురేఖావాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా వెండితెరకు పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. తన తొలి చిత్రం ‘అమరా వతికి ఆహ్వానం’ ప్రమోషన్లలో భాగంగా ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. మంచి కథ వస్తే క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ఇద్దరు హీరోలకు మాత్రం మాత్రం చెల్లిగా నటించనని పేర్కొంది. ఃఃపవన్ కల్యాణ్, ఎన్టీఆర్ వంటి స్టార్లకు చెల్లిగా నటించే అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను. కానీ, విజయ్ దేవరకొండ, అఖిల్ అక్కినేనిలకు మాత్రం సిస్టర్ గా చేయనుఃః అని సుప్రీత స్పష్టం చేసింది. వాళ్లిద్దరూ అంటే తనకు చాలా ఇష్టమని, టెన్త్ క్లాస్ పాసయితే అఖిల్ తో డిన్నర్ కు తీసుకెళ తానని అమ్మ మాటిచ్చిందని సుప్రీత వెల్లడించింది. కానీ ఇంతవరకు అది నెరవేరలేదని విచారం వ్యక్తం చేసింది. హీరోయిన్‌గా మాత్రమే కాకుండా విభిన్న పాత్రలు పోషించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆమె తెలిపింది. సుప్రీత నటిస్తున్న ‘అమరావతికి ఆహ్వానం’ అనే హారర్ చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు రానుంది.ఇదే ఇంటర్వ్యూలో తన జీవితంలో ఎదుర్కొన్న ఓ భయంకరమైన అనుభవా న్ని కూడా సుప్రీత పంచుకుంది. బరువు పెరిగావంటూ చుట్టూ ఉన్నవారు అనడంతో తీవ్రమైన ఒత్తిడికి గురయ్యానని, దాంతో బరువు తగ్గాలని తప్పుడు డైటింగ్ పద్ధతులు పాటించానని సుప్రీత భావోద్వేగంతో చెప్పింది. ఃఃఒత్తిడి పెరిగినప్పుడల్లా ఇంకా ఎక్కువ తినేదాన్ని. దాంతో లావయ్యాను. వెంటనే బరువు తగ్గాలని నిర్ణయించుకుని, రోజుకు ఒక పూట మాత్రమే తినడం మొదలుపెట్టా. సుమారు 12 నుంచి 15 గంటలు ఏమీ తినకుండా ఉండేదాన్ని.

# జూలై బరిలోకి చిరంజీవి..




‘మన శంకరవరప్రసాద్‌గారు’ సినిమాతో ఈ సంక్రాంతికి బ్లాక్ బస్టర్ అందుకున్నాడు అగ్ర కథానాయకుడు చిరంజీవి. ఇప్పటివరకు ఈ చిత్రం రూ.360 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ భారీ విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న చిరు ఇప్పుడు తన తదుపరి సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్ ‘విశ్వంభర’ను వెండితెరపైకి తెచ్చేందుకు వేగంగా అడుగులు వేస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. గతేడాదే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం వీఎఫ్ఎక్స్ పనుల వలన ఆలస్యం అవుతూ వస్తుంది. అయితే ప్రస్తుతం గ్రాఫిక్స్ పనులు తుది దశకు చేరుకోవడంతో, జూలై తొలి వారంలో ముఖ్యంగా జూలై 9 లేదా 10వ తేదీన సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఇటీవల జరిగిన విలేకర్ల సమావేశంలో చిరంజీవి కూడా సానుకూలంగా స్పందిస్తూ, జూలైలో సినిమా వచ్చే అవకాశముందని ధృవీకరించినట్లు తెలుస్తుంది. క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదనే ఉద్దేశంతో మేకర్స్ సుమారు రూ.75 కోట్ల వరకు కేవలం గ్రాఫిక్స్ కోసమే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215